మహామాయ-12

# దండయాత్ర

డిటెక్టివ్ & మిస్టరీ నవల



రచన

**కనకమేడల**

8 అణాలు

మహామాయ-12

# దండయాత్ర

రచన

కనకమేడల

ప్రథమ ముద్రణ
జనవరి 1957

పాఠకులకు, ఏజెంట్లకు,

ఈ పుస్తకంతో మహామాయ సీరియల్ సగాన్ని చేరుకుంది. మిగిలిన సగాన్ని కూడా సులభంగా దాటి నవలా సాహిత్యంలో అపూర్వసృష్టి అనిపించుకుంటుందనడంలో సందేహం లేదు. ఇందుకు తగినవిధంగా మీనుండి లభిస్తున్న ఆదరాభిమానాలకు ధన్యవాదాలు.

వెల
0-8-0

మా సంస్థ తరఫున వెలువరించబోతున్న 'కథానిక' మాసపత్రికకు సంబంధించిన వివరాలను చివరి పేజీలో చూడండి. మా ప్రచురణల పట్ల చూపిన్నట్లే పత్రిక పట్లకూడా మీ విశేషాదరాభిమానాలను చూపవలసిందిగా అభ్యర్థిస్తున్నాం.

డైరెక్టర్

ముద్రణ: శ్రీనిలయం
మద్రాసు-17

నర్మద భవనంలో అనేక విచిత్ర సంఘ
టనలు జరిగాయి. విపత్కర పరిస్థితు
లనేకం ఏర్పడ్డాయి. అయితే నర్మద
ఈ ఉపద్రవాల నుండి సులభంగా
బయటపడగలిగింది. మరో ప్రక్క యమ
దూతకూడా చిక్కుల్లో ఇరుక్కున్నాడు.
కాని ఆ సమయంలో ఒక వికృతపు
మనిషి అతనిని కాపాడి నర్మద భవనానికి
తీసుకు వెళ్లాడు. అక్కడ జరిగిన ఒక
ఘటన అందరినీ ఆశ్చర్యచకితుల్ని
చేసింది. తర్వాత—

# 1

కాసేపు నర్మద భవనంలోని ఆ గదిలో నిశ్శబ్దం ఆవరించింది. అందరూ మౌనంగా పద్మినివంక చూస్తూ ఉండిపోయారు. కొంతసేపటికి ఆమె తేరుకుంది. ఒకసారి మళ్ళీ నేలమీద ఉన్న ఆ వ్యక్తివంక పరీక్షగా చూసి తరువాత తన దృష్టిని వికృతపు మనిషిమీదకి పోనిచ్చింది.

'మీరెవరు? ఈ వ్యక్తిని ఎక్కడినుంచి తీసుకువచ్చారు?' ఆమె అడిగింది.

ఇంతలో నర్మద పద్మినితో అంది.

'ఆ మనిషి ఎవరో తర్వాత తెలుసుకుందాం. ముందు నాకీ సంగతి చెప్పు. క్రింద పడిఉన్న వ్యక్తి ఎవరో నీకు తెలుసా? అతనిని చూడగానే నువ్వు ఎందుకు ఆర్తనాదం చేశావు?'

పద్మిని ఏదో చెప్పబోతుండగా ఆ వికృతపుమనిషి బిగ్గరగా అన్నాడు.

'నేనెవరో తెలుసుకోవాలని అందరికీ కుతూహలంగా ఉన్నట్టుంది. పోనీ చెప్పేస్తాను.'

నర్మద చిరునవ్వు నవ్వింది. యమదూత ఆతురతగా ఆ వ్యక్తివంక చూశాడు.

ఆ మనిషి కాసేపట్లో తన వేషాన్ని మార్చాడు. అసలు రూపంలో అతనిని చూడగానే అందరికీ ఆశ్చర్యం కలిగింది. ముఖ్యంగా యమదూత, పద్మిని అంతులేని ఆశ్చర్యంలో కాసేపటివరకు మాట్లాడలేక పోయారు.

అసలు వేషంలోకి వచ్చిన మంత్రవాది అందరివంకా ఓసారి సగర్వంగా చూశాడు. పద్మిని కాసేపటికి అంది.

'మీరీ వ్యక్తిని ఎక్కడినించి తీసుకువచ్చారు. ఈయననీ స్థితిలోకి తీసుకువచ్చిందెవరు?'

మంత్రవాది నెమ్మదిగా చెప్ప నారంభించాడు.

'నేను అడవిలో ప్రయాణం చేస్తుండగా ఒకచోట యమదూత, ఈ వ్యక్తి కనిపించారు. చాటున దాగి వాళ్ల సంభాషణంతా విన్నాను. ఈ వ్యక్తి యమదూతను బెదిరించి అతనిని వెంట పెట్టుకుని ఎక్కడికో వెళ్తున్నాడు. ఈ వ్యక్తి దగ్గర ఒక చిన్నపెట్టె ఉంది. ఆ పెట్టెలో ఏముందో తెలియదు కాని దానిని చూసి యమదూత గడగడలాడిపోవడం గమనించాను. వాళ్ల వెంట వెళ్లి సంగతేమిటో తెలుసుకోవాలనుకున్నాను. చివరికి అతనిని స్పృహతప్పేట్టు చేసి యమదూతతో సహా ఇక్కడికి తీసుకువచ్చాను.'

పద్మిని యమదూత నేదో అడగబోతుండగా నర్మద మంత్ర వాది నడిగింది.

'మీరు రాజకుమారులతో బయలుదేరి వెళ్ళిపోయారు కదూ! తిరిగి ఇక్కడెలా ప్రత్యక్షమయ్యారు?'

మంత్రవాది ఆమె ప్రశ్నకు వెంటనే సమాధాన మిచ్చాడు.

'రాజకుమారులతోపాటు నేను కొంతదూరం వెళ్ళాను. కాని నాకు కోటకు వెళ్ళాలని అనిపించలేదు. అక్కడ కాళ్లు ముడుచుకు కూర్చోవడం నాకు నచ్చదు. ఆ విషయం రాజ కుమారులకు చెప్పాను. నాకు ఏదో ఒక పని కావాలి. పని చెయ్యడంలో నేను ఆనందాన్ననుభవిస్తాను. చేతులు ముడు చుకు కూర్చోవడంలో నాకు ఆనందంలేదు. ఈ సంగతి విన్న రాజకుమారులు నన్ను రాయదుర్గం వెళ్లి అక్కడి పరిస్థితులు చక్కబెట్టమని ఆజ్ఞాపించారు. వాళ్లనుండి వేరుపడి రాయ దుర్గానికి బయలుదేరి వెళ్తుండగా ఈ సంఘటన జరిగింది. అందు చేత మళ్ళీ ఇక్కడికి అనుకోకుండా రావలసి వచ్చింది.'

మళ్ళీ ఒక్కక్షణం అక్కడ నిశ్శబ్దం ఆవరించింది. పద్మిని దృష్టి యమదూతవైపు తిరిగింది. నెమ్మదిగా అడిగింది.

'ఈ వ్యక్తి ఎవరో మీకు తెలుసునా?'

'తెలుసు. కాని ఎవరో మాత్రం నేను స్పష్టంగా చెప్ప లేను.' యమదూత జవాబిచ్చాడు.

'ఎందుచేత?'

'అందుకు తగిన కారణాలున్నాయి. సమయం వచ్చి నప్పుడు చెబుతాను. ప్రస్తుతం చెప్పలేను.'

'పోనీ ఆ పెట్టెలో ఉన్న వస్తువేమిటో చెప్పగలవా?' నర్మద యమదూత నడిగింది.

'ఆ పెట్టెలో ఏముందో నిజంగా నాకు తెలియదు,' యమదూత సమాధానంగా అన్నాడు.

'మరి ఆ పెట్టెను చూడగానే ఎందుకు భయపడిపోయావ్?' మంత్రవాది అడిగాడు.

'అందులో పద్మిని ప్రాణాలకు సంబంధించిన ముఖ్య వస్తువు ఏదో ఉందనడంతో నేను కంగారు పడిపోయాను,' యమదూత అన్నాడు.

'పద్మిని నీకు చాలాకాలంగా తెలుసా?' నర్మద అడిగింది.

'తెలుసు,' అతనన్నాడు.

'మరి ఎప్పుడూ చెప్పలేదే?'

'చెప్పడానికి తగిన సమయం రాకపోవడంచేత చెప్పలేదు.'

'ఆమె నీకెలా తెలుసు?'

'ఆమె అసలు ఎవరో వారు ఆమె ద్వారానే తెలుసుకుంటే మంచిది.'

'ఆమె చాలా కాలంగా నాదగ్గర ఉంటోంది. అంతకు మించి నాకామెను గురించి తెలియదు. ఆశ్రయం కోరితే ఆశ్రయ మిచ్చాను. నమ్మకంగా ప్రవర్తించడంచేత ఆప్తురాలిలా భావిస్తున్నాను.'

ఈ సంభాషణ వింటున్న పద్మిని ఆశ్చర్యంగా ఇద్దరివంకా చూడసాగింది.

'ఆమె పూర్వ వృత్తాంతం ఆమెనే అడగండి.' యమదూత చివరికి అన్నాడు.

నర్మద చూపులు పద్మిని వైపు తిరిగాయి. ఆమె తల వంచుకుని నెమ్మదిగా అంది.

'నా అసలు సంగతి బయట పెట్టడం నాకిప్పుడిష్టం లేదు. మరి కొంతకాలం జరిగాక చెబుదామనుకున్నాను. కాని ఇప్పుడే చెప్పవలసి వచ్చింది.'

పద్మిని ఆగి ఒకసారి గట్టిగా నిట్టూర్చింది. అంజలివంకా చూసింది. ఆమె కళ్ల నుండి అశ్రుబిందువులు రాలసాగాయి. అందరూ ఆమెవంక వింతగా చూశారు. ఆమె ఏం చెబుతుందో వినడంకోసం ఆతురత చెందసాగారు.

పద్మిని నెమ్మదిగా అంది.

'నర్మదా' మారువేషంలో ఉన్న ఈ అభాగ్యురాలిని నువ్వు గుర్తించ లేకపోయావు. నేను కళ్యాణిని.'

ఈ మాటతో ఆమె కళ్లనుండి నీళ్లు జలజల కారిసాయి. అందరూ ఆశ్చర్యంగా ఆమెవంక చూశారు. ఆ ఆశ్చర్యంలోంచి తేరుకున్న నర్మద, భవాని 'అక్కా,' అంటూ ఆమెను ఆప్యాయంగా కావిలించుకున్నారు. రఘువీర్ మహారాజా పాలుపోక ఆమెవంక చూస్తూ ఉండిపోయాడు.

ముగ్గురు అక్కచెల్లెళ్లు ఆనందవిచారాలలో కాసేపు మైమరచారు. కాసేపటికి నర్మద అంది.

'ఇంతకాలంనించి నా దగ్గర ఉంటూ నాకారహస్యం చెప్పకుండా ఎలా ఉండగలిగావు?'

కళ్యాణి తలెత్తి నర్మదవంక చూసింది.

'మరో ఆశ్చర్యకరమైన సంగతి. ఈ విషయం వింటే మరింత ఆశ్చర్యపోతారు. క్రింద పడిఉన్న ఈయన మన

తన్నడి. నామూలంగా ఎంతో కాలం జైలులోపల క్రుగ్గి పోయిన కారణంగా ఎవరూ వెంటనే గుర్తుపట్టలేనంతగా మారిపోయారు. ఈయననీ స్థితిలో చూస్తే బాధకలిగి ఆర్తనాదం చేశాను,' ఆమె అంది.

ఈ విషయం వినగానే అందరికీ గుండె లాగిపోయేటంత ఆశ్చర్యానందాలు కలిగాయి. ఎవరూ వెంటనే మాట్లాడగలిగే స్థితిలో లేరు. యమదూత మాత్రం ఏదో అనబోయి ఆగిపోయాడు. కాని ఆ సంగతి ఎవరూ గమనించలేదు.

మంత్రవాది క్రింద పడిఉన్న ఆ వ్యక్తివంక ఒకసారి పరీక్షగా చూశాడు. తర్వాత అతని చూపు నర్మదమీదకి మరలింది. ఆమె మితిమీరిన ఆనందాశ్చర్యాలలో మునిగిపోయి ఉంది.

మంత్రవాది మరుక్షణంలో ఆ వ్యక్తికి తెలివి తెప్పించడానికి ప్రయత్నించసాగాడు. మిగిలిన వాళ్లందరూ ఆయన స్వప్రహలోకి రావడంకోసం ఎదురు చూస్తున్నారు. ముగ్గురు అక్కచెల్లెళ్లు ఆనందబాష్పాలు రాలుస్తూనే ఉన్నారు.

'నేను ఒకటి రెండుసార్లు చూచి ఉన్నా ఈయన నరసింగభూపతి అని గుర్తించలేకపోయాను,' అన్నాడు రఘువీర్ మహారాజు కళ్యాణివంక ఓరకంట చూస్తూ. ఈమాట విన్న కళ్యాణికూడా ఓసారి సిగ్గుపడుతూ ఆయనవైపు తన దృష్టిని పోనిచ్చింది.

నరసింగభూపతికి తెలివి వచ్చింది. కళ్లు తెరచి ఎదురుగా ఉన్న వ్యక్తులనందరినీ ఓసారి పరికించి చూశాడు. ఆయన లేచి నిలబడగానే నర్మద, భవాని, కళ్యాణి ఆప్యాయంగా 'నాన్నా,'

అంటూ ఆయన దగ్గరకు చేరారు. ఆయనకూడా మాగ్గర్నీ మరింత దగ్గరికి తీసుకున్నాడు.

'అనేక విచిత్ర సంఘటనల-అనంతరం మమ్మల్ని కలుసుకో గలిగాను. చాలా ఆనందంగా ఉంది. కాని కొన్నాళ్లవరకు బయట పడకుండా ఉందామనుకున్న నేను ఈరోజు వెల్లడి కావలసివచ్చింది. అయినా నా శత్రువులమీద పగ తీర్చుకో వలసిన పని ఇంకా తీరలేదు,' ఆయన అన్నాడు.

ఆయన దృష్టి ఒక ప్రక్కగా నిలబడిఉన్న యమదూత మీదకి మరలింది. యమదూత ఆయనను చూడగానే బిగి భయంతో కంపించి పోసాగాడు. ఎందుకో అతను చాలా కంగారు పడుతున్నట్టు కనిపిస్తున్నాడు.

మళ్లీ అంపరివంకా ఆయన ఓసారి చూశాడు. ఒక ప్రక్కగా ఉచితాసనంమీద కూర్చునిఉన్న రఘువీర్ మహా రాజాను చూస్తే ఆయనకు చాలా ఆనందం కలిగింది. ఆప్తులైన వారందరూ అక్కడే ఉన్నారు.

కాని తనను అక్కడికి తీసుకువచ్చిన వ్యక్తి ఎవరో ఆయనకు తెలియలేదు. అందరిలోను అపరిచితుడైన వ్యక్తి ఒక్కడే ఆయనకు కనిపిస్తున్నాడు. మంత్రవాదివంక అనుమానంగా చూస్తూ ఆయన అన్నాడు.

'నన్నిక్కడికి తీసుకువచ్చిన ఆ వికృతపు మనిషి ఎవరో నాకు తెలియకుండా ఉంది.'

నర్మద చిరునవ్వు నవ్వింది. మంత్రవాదివంక చూపిస్తూ అతని నాయనకు పరిచయం చేసింది. కాని ఆమె మనస్సులో ఈ సందర్భంలో అనేక ఆలోచనలు, సందేహాలు మొదల

సాగాయి. రోజులు గడిచినకొద్దీ అనేక విచిత్ర సంఘటనలు జరుగుతున్నాయి. ఇదమిత్థమని తేల్చుకోలేని పరిస్థితు లేర్పడు తున్నాయి. చనిపోయాడనుకున్న రఘువీర్ మహారాజు బ్రతికి ఉన్నాడు. ఎంతో కాలం తన సోదరిగా భావించిన మహా మాయ పరాయి వ్యక్తి అయింది. ఇప్పుడు మళ్లీ ఎన్నడో చని పోయాడనుకున్న తన తండ్రి బ్రతికి తన ఎదుట ఉన్నాడు. ఈ సంఘటనలన్నీ ఆమె మనస్సులో విచిత్రాలోచనలు కలిగేట్టు చేశాయి.

భవానికూడా అదే స్థితిలో ఉంది. అసలు మొదటినించీ జరిగిన విషయాలన్నీ తన తండ్రిద్వారా వినాలని ఆమె కుతూ హల పడసాగింది. తన అక్క కళ్యాణికూడా ఎన్నో విష యాలు చెప్పగలదు. అవన్నీ ఎప్పుడు తెలుసుకుందామా అని ఆమె ఆరాట పడిపోతోంది.

మంత్రవాది తన దగ్గరగానే నిలబడి ఉన్న యమ దూతవంక చూశాడు. అతను శిలాస్థంభంలా నిలబడి ఉన్నాడు.

నరసింగభూపతి యమదూతవంక చూసి కోపంగా అన్నాడు.

'ఈ నీచుడు ఇక్కడెందుకున్నాడు? వీడిని మీ రెలా క్షమించగలిగారు?'

నర్మద ఈమాట వినగానే ఆశ్చర్యంగా ఆయనవంక చూసింది.

'యమదూత నాకనేకవిధాల సాయం చేస్తూ వచ్చాడు,' ఆమె అంది.

'కాని వాడు దుర్మార్గుడు. మనకు ఎంతగా అపకారం చేశాడో ఆ విషయం నువ్వు తెలుసుకుంటే ఏమాత్రం సహించలేవు,' ఆయన అన్నాడు.

యమదూత పిచ్చివాడిలా ఆయనవంక చూశాడు.

'నేను కాదు నీచుణ్ణి. నువ్వు—' అతను తన మాటలు పూర్తిచెయ్యకముందే నర్మద మంత్రవాదికేదో సంజ్ఞ చేసింది. వెంటనే మంత్రవాది యమదూతను తీసుకుని ఆ గదిలోంచి బయటికి వెళ్ళాడు. తర్వాత కాసేపటికి ఒంటరిగా ఆ గదిలోకి తిరిగి వచ్చాడు.

'యమదూత మనకు చేసిన అపకారమేమిటో తెలుసుకోవాలని ఉంది,' నర్మద నెమ్మదిగా అంది.

వరసింగభూపతి మందహాసం చేశాడు. నవ్వుతూనే ఆయన తన దుస్తుల్లో దేనికోసమో వెదుక్కోసాగాడు. ఆయన వెదుక్కోవడం చూసిన మంత్రవాది తనదగ్గర ఉన్న చిన్న పెట్టెను ఆయన ముందుంచాడు.

'దీనికోసమే వెదుకుతున్నాను. ఇది మీ దగ్గర ఉందన్న సంగతి నాకు తెలియనేలేదు,' అంటూ ఆయన ఆ పెట్టెని చేతిలోకి తీసుకున్నాడు. దానిని నెమ్మదిగా తెరిచాడు. అందులో కొన్ని కాగితాలు మడతలుపెట్టి ఉన్నాయి. ఆయన వాటిని బయటికిలాగి అన్నాడు.

'అందరూ కూర్చుని ఈ కాగితాలను తీరుబడిగా చదవండి. మీకు పట్టలేనంత ఆశ్చర్యాన్ని కలిగించే అనేక విషయాలు తెలుస్తాయి. నేను వేరే యమదూతను గురించి చెప్పనక్కరలేదుకూడా. మీరే స్వయంగా ఆ నీచుణ్ణి శిక్షించడానికి పూనుకుంటారు.'

మంత్రవాది ఆ కాగితాలను అందుకున్నాడు. అందులో మూడు ఉత్తరాలున్నాయి. వాటివంక అతనోసారి ఆశ్చర్యంగా చూశాడు.

'బిగ్గరగా చదవండి. అందరూ వింటారు,' నరసింగ భూపతి అన్నాడు.

మంత్రవాది మొదటి ఉత్తరాన్ని చేతిలోకి తీసుకుని చదవడం ఆరంభించాడు.

'ప్రియమిత్రునకు,

నువ్వు కోరినప్రకారం ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నాను. కేవలం ఇందులో నీకు సాయం చేయాలనే అభిలాష మాత్రమే కాక నా స్వార్థంకూడా ఉందని గ్రహించు. అందుచేత నా ప్రయత్నాలు సఫలమయ్యేట్లు చూస్తాను. మంత్రి సాధును కలుసుకున్నాను. అతను కూడా నేను చూపిన ఆశలకు లోబడి నేను చెప్పినట్లు చెయ్యడానికి అంగీకరించాడు. కళ్యాణి స్థానంలోకి మన ఇందుని చేరిస్తే తర్వాతి సంగతులన్నీ అతను చూసుకుంటానన్నాడు. కళ్యాణిని, నరసింగ భూపతిని, ఇంకా అవసరమైన వాళ్లనందరిని బంధించే ఉపాయం అతనే చూస్తాడు. మనం మన పనిని నెరవేరిస్తే చాలు. చాలా జాగ్రత్తగా ఉండాలిసుమా!

ఇక నాపేర ఉత్తర ప్రత్యుత్తరాలు జరపవద్దు. నేను పేరు, వేషం మార్చుకుంటున్నాను. ఇక ముందు నాపేరు యమదూత. మరచిపోవద్దు. జ్ఞాపకముంచుకో.

నీ మిత్రుడు

యమదూత.'

ఈ ఉత్తరం చదివి మంత్రవాది ఆగిపోయాడు. అక్కడున్న అందరి మొఖాలలోంచి విచిత్రభావాలు వ్యక్తం కాసాగాయి. ఎవరూ తమ భావాలను అణచుకోలేకపోతు న్నారు.

'నాకా ఉత్తరం సరిగా బోధపడలేదు,' భవాని హీన స్వరంలో అంది.

'అక్కడకు బదులుగా మరొక స్త్రీని రఘువీర్ మహారాజుకు రాణిగా పంపే కుతంత్రంలో యమదూతకూడా పాల్గొన్నా డన్నమాట,' నర్మద అంది.

'పాల్గొనడమే కాదు. ముఖ్య పాత్రధారి అతను. అతను తలపెట్టకపోతే ఈ పని జరిగి ఉండేదే కాదు. ఇన్ని అనర్థాలు, విచిత్ర సంఘటనలు జరిగేవి కావు,' నరసింగభూపతి అన్నాడు.

'ఇందు ఎవరు? యమదూత ఈ ఉత్తరాన్ని ఎవరికి రాశాడు?' మంత్రవాది అనుమానంగా అడిగాడు.

'ఇందు అసలుపేరు ఇందిర. అదే ఈనాటి మహామాయ. యమదూత స్నేహితుని కుమార్తె. వీళ్లందరూ డబ్బుకోసం పన్నాగం పన్నారు. చివరికి కళ్యాణికి బదులుగా దానిని మహారాణిని చేశారు. ఈ రహస్యం చిరకాలం దాగి ఉంటుం దని వాళ్ళు భావించారు. కాని నిజం ఎప్పటికయినా బయట పడక తప్పదు. దుష్టులు తాము చేసిన దుష్కృత్యాలకు ఫలి తాల ననుభవించకపోరు,' నరసింగభూపతి అన్నాడు.

ఈ సంగతి వినగానే నర్మదకు యమదూతమీద అంతు లేని కోపం కలిగింది. ఎదురుగా ఉంటే అతనిని తక్షణం

శిక్షించి ఉంటేది. అయినా కొంత కోపాన్ని అణచుకుని ఆమె మంత్రవాదితో అంది.

'రెండవ ఉత్తరం చదువు.'

మంత్రవాది రెండో ఉత్తరం విప్పి చదవనారంభించాడు.

'ప్రియమిత్రునకు.

మన ప్రయత్నాలు నెలవేర్చుకోవాల్సిన సమయం వచ్చింది. నరసింగభూపతి సతీ సమేతంగా కళ్యాణిని తీసుకుని రఘువీర్ మహారాజు దగ్గరకు వెళ్తున్నాడు. వీళ్లను తీసుకు వెళ్లడానికి మంత్రి సాధు వెళ్లాడు. అతను వాళ్ల వెంట ఉంటాడు. మనం బందిపోటు దొంగల వేషంలో వెళ్లి అడవిలో వాళ్ల నెదుర్కోవాలి. నరసింగభూపతిని, అవసరమైన వ్యక్తుల్ని బంధించాలి. కళ్యాణి ఉన్న మానాలోకి కళ్యాణి వేషంలో ఉన్న ఇందును చేర్చాలి. మంత్రి సాధు ఇందును కళ్యాణి రూపంలో తీసుకు వెళ్తాడు. ఇందుకు తగిన సన్నాహాలు ముందుగానే చేసి ఉంచు. నేను నిన్ను త్వరలోనే కలుసుకుంటాను. మిగిలిన విషయాలు స్వయంగా మాట్లాడుకుందాం.

నీ మిత్రుడు

యమదూత.'

ఈ ఉత్తరం చదవడం పూర్తికాగానే అందరికీ ఆవేశం పూనినట్టయింది. ఒళ్లు తెలియనికోపం అందరినీ ఆవరించింది. జరిగిన సంఘటనలన్నీ వాళ్ల కళ్లముందు మెదిలినట్టయింది. మూడో ఉత్తరం కూడా చదివే సహనం వాళ్లకు లేక పోయింది.

'ఇంత ఘోరమైన పనులు యమదూత చేశాడా? కేవలం నరేంద్రమహారాజును ద్రోహం చేసి స్వర్ణగంధాన్ని దొంగిలించాడని మాత్రమే అనుకున్నాను. కాని నా కుటుంబానికి కూడా క్షమించరాని అపకారం చేశాడని గ్రహించలేకపోయాను. అంతటి దుర్మార్గుణ్ణి ఎలా క్షమించడం!' ఆమె ఆవేశంలో కోపంతో అంది.

'ఆ దుర్మార్గుణ్ణేం చెయ్యమంటే అది చెయ్యడానికి సిద్ధంగా ఉన్నాను,' భవాని తన సోదరితో అంది మరింత ఆవేశంతో. నర్మద భవాని మాటలు వినిపించుకోలేదు. మంత్రవాదివైపు తిరిగింది.

'యమదూత ఎక్కడున్నాడు?' ఆమె అడిగింది.

'ఒక గదిలో అతనిని ఉంచి వచ్చాను. మీ గూఢచారి ఒకతనక్కడే ఉన్నాడు,' మంత్రవాది సమాధానమిచ్చాడు.

'అతనిని వెంటనే బంధించి ఖైదులో పడేయించండి,' నర్మద కోపంగానే అంది.

'బంధించే ముందు ఎందుకైనా ఓసారి ఆలోచిస్తే మంచిది,' మంత్రవాది అన్నాడు.

నరసింగభూపతి పరిహాసంగా నవ్వాడు.

'ఆ నీచుణ్ణి బంధించడం ఇంకా మీ కిష్టం లేదన్నమాట. ఆ మూడో ఉత్తరం కూడా చదవండి. అప్పుడు మీరే స్వయంగా వెళ్లి ఆ దుర్మార్గుణ్ణి బంధించి వస్తారు.'

మంత్రవాది మూడో ఉత్తరం చేతిలోకి తీసుకున్నాడు. ఇంతలో నర్మద అరచింది.

'వద్దు. ఇప్పటికే నా హృదయం కోపంతో కంపించి పోతోంది. ముందు మీరు వెళ్లి ఆ దుర్మార్గుణ్ణి బంధించి రండి. నేను బాగానే ఆలోచించి అంటున్నాను. తర్వాతి సంగతులు తర్వాత చూసుకుందాం.'

మంత్రవాది మారుమాట్లాడకుండా గదిలోంచి బయటికి నడిచాడు.

## 2

మంత్రవాది వెళ్లేసరికి యమదూత గదిలో ఏదో గంభీరంగా ఆలోచిస్తూ కూర్చున్నాడు. అసలే భయంకరంగా ఉండే అతని ముఖానికి ఈ గంభీరాలోచన మరింత వికృతిని చేర్చింది. అతనికి కొంచెం దూరంలో నర్మద గూఢచారి కూర్చుని ఉన్నాడు. అతను కూడా మౌనంగానే ఉన్నాడు. ఏమీ మాట్లాడడం లేదు.

మంత్రవాది గదిలో ప్రవేశించగానే ఆ గూఢచారి లేచి నిలబడ్డాడు. అతను చేసిన సైగ ననుసరించి మరుక్షణంలో ఆ గదిలోంచి బయటికి వెళ్లిపోయాడు. మంత్రవాది యమదూతకు దగ్గరగా వెళ్లాడు.

యమదూత అతనివంక తలెత్తి చూశాడు. అతని కళ్ళు ఎర్రగా ఉన్నాయి. కాని అందులోంచి దీనత్వం ప్రస్ఫుటమౌతోంది. మంత్రవాదికి అతనిని చూస్తే ఒక ప్రక్క చెప్పరానంత క్రోధం, మరొకప్రక్క జాలి కలిగాయి. నెమ్మదిగా అన్నాడు.

'మిమ్మల్ని బంధించమని ఆజ్ఞ అయింది.'

'ఎందుకు?' యమదూత ఆశ్చర్యంగా అడిగాడు.

'అన్నీ తెలిసికూడా నువ్వు తెలియనట్టు నటిస్తున్నావు. నీ అంత నీచుడుకోడని ఆ ఉత్తరాలు తెలియచేస్తున్నాయి,' మంత్రవాది కొంచెం కోపంగా అన్నాడు.

'ఏ ఉత్తరాలు?' యమదూత మళ్లీ అడిగాడు.

'అవే. ఆ పెట్టెలో ఉన్న ఉత్తరాలు. కళ్యాణిని మార్చి ఇందును మీనాలోకి ఎక్కించడానికి చేసిన ప్రయత్నాల బాపతు ఉత్తరాలు. అందుకే నువ్వా పెట్టెనుచూసి అంత భయపడ్డావు,' మంత్రవాది ఎగతాళిగా అన్నాడు.

'అంతా మోసం. మీరు మోసంలో పడ్డారు. ఆ వ్యక్తి మిమ్మల్ని పూర్తిగా మోసగించాడు,' యమదూత ఆవేశంలో అరిచాడు.

'కాదు. ఆ ఉత్తరాలు నేనే చదివాను. అవి నువ్వు నీ మిత్రుడికి రాసినవి. నీ దస్తూరి నాకు బాగా తెలుసు. అవి నువ్వు రాసినవే,' మంత్రవాది దృఢంగా అన్నాడు.

'కాని ఆ వ్యక్తి నరసింగభూపతి కాదు. మిమ్మల్ని మోసగించడానికి ఒక వ్యక్తి మారువేషంలో వచ్చాడు,' యమదూత అన్నాడు.

'అయితే ఆ వ్యక్తి ఎవరు?'

'ఆ సంగతి నేను చెప్పలేను.'

'మరి ఆ వ్యక్తి నరసింగభూపతి కాదని నిరూపించగలవా?'

నిరూపించగలను. నరసింగభూపతి ఒకచోట బంధింపబడి ఉన్నాడు. కావాలంటే మిమ్మల్ని అక్కడికి తీసుకు

వెళ్తాను. ఆయనను చూస్తే మీ కు నిజానిజాలు తెలుస్తాయి.'

మంత్రవాది ఒక్క నిమిషం ఆలోచించాడు. యమదూత చెప్పే దానిలో ఏమైనా నిజం ఉందేమో అనిపించిందతనికి. తాము ఒకవేళ మోసగించబడి ఉండవచ్చు. కొంచెం తెలివి తేటలు ఉపయోగించాల్సిన సమయమిది.

మంత్రవాది ఆలోచనలో పడడం గమనించిన యమదూత ప్రాథేయ పూర్వకంగా అన్నాడు.

'ఎవరో ఒక మోసకారి మాటలువిని మిమ్మల్ని నమ్మి విశ్వసనీయంగా ప్రవర్తిస్తున్న నన్ను అవమానించడం మంచిది కాదు. మరోసారి ఆలోచించి ఆ మూర్ఖుడికి తగిన బుద్ధి చెప్ప గల అవకాశం నాకివ్వమని కోరుతున్నాను.'

మంత్రవాది యమదూత ముఖంవంక చూశాడు. అతను దీనంగా ఉన్నాడు.

'అయితే నాకేవో సందేహాలు కలుగుతున్నాయి. వాటికి సమాధానాలు చెబుతావా?' మంత్రవాది అడిగాడు.

యమదూత సరేనన్నట్టుగా తల ఊపాడు.

'మహామాయ అసలు మహారాణి కాదని, కళ్యాణి అనే ఆమె ఎక్కడో ఉందని మేం అడవిలో సందేహాలతో చర్చించుకుంటున్న సందర్భంలో, ఈ విషయాలన్నీ తెలిసిన నువ్వు ఎందుకు మౌనం వహించావ్? అప్పుడే నీకు తెలిసిన విషయాలు నువ్వెందుకు చెప్పలేదు?' మంత్రవాది అడిగాడు.

'ఈ విషయాలు తాను అనుమతించేవరకు ఎవరితోనూ చెప్పవద్దని నరసింగభూపతిగారు నన్ను కోరారు. అలాగేనని

ఆయనకు మాట ఇచ్చాను. అందుచేత అప్పుడేమీ చెప్పలేక పోయాను,' యమదూత సమాధానమిచ్చాడు.

ఒక్కక్షణం ఆగి మంత్రవాది మళ్లీ అడిగాడు.

'కళ్యాణి ఆ వ్యక్తి తమ తండ్రి అని చెప్పినప్పుడు కాదని నువ్వు తెలిసి ఉండికూడా ఎందుకు ఊరుకున్నావు?'

'అతను అసలు నరసింగభూపతి కాదని చెబుదామను కున్నాను. కాని అందరూ అతనే నరసింగభూపతి అని నమ్మి ఆ గొడవలో నా మాట వినిపించుకునేట్టు కనిపించలేదు. అయినా ఏం జరుగుతుందో చూద్దామని ఊరుకున్నాను. తర్వాత అన్ని సంగతులూ చెప్పవచ్చుననే ధీమాతో ఉన్నాను. కాని ఆ వ్యక్తి మీ మనసుల్ని పూర్తిగా స్వాధీన పర్చుకున్నాడు,' అన్నాడు యమదూత.

కాసేపాగి మంత్రవాది మళ్లీ అన్నాడు.

'సరే. నువ్వు చెప్పిన విషయాలన్నీ నర్మద వగైరాలతో చెబుతాను. అవసరమైతే నువ్వు ఆ వ్యక్తి నరసింగభూపతి కాదని నిరూపిస్తావు కదూ!'

'తప్పకుండా. నా మీదకి వచ్చిన ఈ కళంకాన్ని బాపు కోడానికి నేను శాయశక్తులా ప్రయత్నిస్తాను. అసలు నరసింగ భూపతి దగ్గరికి మిమ్మల్ని తీసుకువెళ్తాను కూడా,' యమదూత జవాబుగా నొక్కి చెప్పాడు.

మంత్రవాది అక్కడినించి నర్మద గదిలోకి వెళ్ళాడు. గదిలో నిశ్శబ్దంగా ఉంది. ఎవరికి వారు ఏవో విషయాలు ఆలోచిస్తూ మౌనంగా ఉన్నారు. మంత్రవాది అక్కడికి వెళ్ల గానే నర్మదతో నెమ్మదిగా అన్నాడు.

'యమదూతను ఎక్కడ బంధించాలో నాకు సరిగా తెలియడం లేదు. ఈ భవనంతో నాకు అంతగా పరిచయం లేకపోవడంవల్ల ఈ చిక్కు ఏర్పడింది. మీరూ, కళ్యాణిగారు వచ్చి అతనిని బంధించే ఏర్పాటు చేస్తే మంచిది.'

నర్మద గబగబా గదిలోంచి బయటకి నడిచింది. ఆమె వెనకాలే కళ్యాణి కూడా వెళ్లింది. మంత్రవాది వాళ్ల ననుసరించాడు. మిగిలిన ముగ్గురూ గదిలోనే ఉండిపోయారు.

యమదూత ఉన్న గదిని సమీపించక ముందే మంత్రవాది ఆతనికీ తనకుమధ్య జరిగిన సంభాషణను గురించి వాళ్లతో చెప్పాడు. ఈసంగతి వినడంతో వాళ్లకుకూడా కొంతసందేహం కలగకపోలేదు. ఊహించడానికికూడా వీలులేని సంఘటనలు జరుగుతున్న ఈ రోజుల్లో ఎవరో తమ తండ్రి రూపంలో తమను మోసగించడానికి వచ్చారనుకోవడంలో వింతలేదు.

'ముందు ఈ విషయాన్ని మనం నిరూపించుకోవడం మంచిది,' అన్నాడు మంత్రవాది నెమ్మదిగా.

'ఈయన మా తండ్రి ఔనో కాదో నిశ్చయంగా తేల్చుకోడానికి తగిన ఆధారం ఏదైనా ఉంటే బాగుంటుంది. ఈ స్థితిలో మనం ఆ వ్యక్తి మాటలుగాని, యమదూత మాటలుగాని నమ్మలేం. మనకు మనమే పరీక్షించి నిజం తెలుసుకోవాలి,' నర్మద అంది.

'ఆయనను గుర్తుపట్టడానికి తగిన గుర్తులేమీ లేవా?' మంత్రవాది కళ్యాణివైపు చూస్తూ అన్నాడు.

కళ్యాణి ముఖం వికసించింది. ఏదో గుర్తువచ్చిన దానిలా అంది.

'ఆయన మెడమీద వెనుకప్రక్క చాలా పెద్ద పుట్టుమచ్చ ఉండేది. దాని ఆధారంగా మనం ఈ సమస్యను పరిష్కరించుకోవచ్చు.'

ముగ్గురూ మళ్లీ వెనక్కి తిరిగి అందరూ ఉన్న గదిలోకి వెళ్లారు. కళ్యాణి ఆ వ్యక్తి కూర్చున్న ఆసనానికి వెనకగా వెళ్లింది. అతనివెనుక నిలబడి తన తీవ్రదృష్టిని అతని మెడ మీదకి పోనిచ్చింది.

ఆమె ఆనందానికి మేరలేదు. పెద్ద పుట్టుమచ్చ కొట్టొచ్చినట్టుగా ఆమెకి కనిపించింది. మంత్రవాది వైపు చూస్తూ ఏదో సంజ్ఞ చేసింది. ఆమెవైపే చూస్తున్న నర్మద కూడా ఆసంజ్ఞలోని భావాన్ని గ్రహించింది.

'యమదూతను బంధించారా?' ఇంతలో నరసింగభూపతి అడిగాడు.

మంత్రవాది వెంటనే అన్నాడు.

'అతనిని ఇక్కడ బంధించడం కంటే రాయదుర్గం తీసుకు వెళ్ళి బంధించడం మంచిదను కుంటున్నాను.'

ఈ మాట విన్న నర్మద మంత్రవాదివంక చూసింది. ఆమెకతని అభిప్రాయం సరయిందిగా కనిపించింది. ఈ భవనంలో తాము ఎన్ని రోజులుండేదీ తెలియదు. అందరూ ఏవో పనుల మీద వెళ్లిపోతా. అందుచేత ఇక్కడ అతనిని బంధించడం శ్రేయస్కరంకాదు. పైగా ఈ భవనానికి సంబంధించిన రహస్యాలు శత్రు వర్గంలో వారికి కూడా తెలిసి ఉంటాయి. తమ ఖైదీలను వాళ్లు విడిపించారు కూడా. అందుచేత, యమ

దూతను రాయదుర్గం తీసుకువెళ్లి అక్కడ బంధించడం మంచిదిగా ఎంచింది నర్మద.

'ఔను. అదే మంచిపని,' అందామె.

మిగిలినవాళ్లుకూడా అందుకు తమ అంగీకారాన్ని వెలిబుచ్చారు.

'రాయదుర్గంలో ఇప్పుడెవరున్నారో?'నర్మద సందేహంగా అంది.

'రాయదుర్గాన్ని స్వాధీనం చేసుకున్న తర్వాత నరేంద్ర మహారాజాదులు ప్రతాప్‌ను వెదకుతూ బయలుదేరారు. రాయదుర్గంలో సైన్యాధిపతి విక్రమ్ కొంత సైన్యంతో పరిపాలకుడుగా ఉండిపోయాడు. ఇంతవరకు నాకు తెలుసు. తర్వాత ఏం జరిగిందీ నాకు తెలియదు. కోటకు వెళ్లింతర్వాత నరేంద్ర మహారాజాగారు అక్కడికెవరినైనా పంపించి ఉండవచ్చు,' మంత్రిహాది ఆమె సందేహానికి సమాధానంగా అన్నాడు.

'మరి అందరం అక్కడికి బయలుదేరి వెడదామా?' కళ్యాణి అంది. ఆమెకు రాయదుర్గాన్ని చూడాలని చాలా కుతూహలంగా ఉంది. ఆ కోటను గురించి, అక్కడి చిత్రగృహాన్ని గురించి ఆమె చాలాసార్లు విన్నది.

నర్మద మందహాసం చేసింది.

'అందరూ వెళ్తే ఈ భవనంలో ఎవరు ఉంటారు? ఇక్కడ ఎవరూ లేకుండా వెళ్తే ఎలా? శత్రువులు ఈ సంగతి గమనిస్తే పూర్తిగా ఆక్రమించుకుంటారు,' ఆమె అంది.

'మరి ఇక్కడెవరిని ఉంచుదాం?' కళ్యాణి మళ్ళీ అడిగింది.

నర్మద చూపు భవానివైపు తిరిగింది.

'భవానికి ఈ భవనానికి సంబంధించిన రహస్యాలన్నీ తెలుసు. చెరువులో పడవ నడిపే మార్గాన్ని గురించి కూడా తెలియ చేస్తాను. మనలో ఎవరైనా తిరిగి వచ్చేవరకు ఇక్కడే ఉంటుంది,' ఆమె అంది.

నిజానికి భవానికికూడా వాళ్లతోపాటు రాయదుర్గం వెళ్ళాలని ఉంది. కొత్తగా దొరికిన తన అక్క కళ్యాణిద్వారా అనేకవిషయాలు తెలుసుకోవాలని ఆమె ఉవ్విళ్ళూరుతోంది. కాని ఇప్పుడామె కుతూహలానికి వ్యతిరేకంగా నర్మద ఆమె నక్కడే ఉండమని అడుగుతోంది. తన కుతూహలం సంగతి ఎలా ఉన్నా ఆమె మాటవినక తప్పదు. ఆమె మనస్సు నెలాగో సమాధానపర్చుకోడానికి ప్రయత్నించసాగింది.

'ఏమంటావు?' నర్మద భవాని నడిగింది.

'అలాగే.' అంది భవాని చివరికి.

ఆ సమస్య అంతటితో తీరిపోయింది. కాని మరోసమస్య ఎదురైంది.

'యమదూతను ఇక్కడే బంధించి అక్కడికి తీసుకు వెళ్ళడమా లేక అక్కడికి తీసుకువెళ్లి బంధించడమా?' అన్నాడు. మంత్రవాది.

ఈ సమస్యకు సమాధానంగా రఘువీర్ మహారాజు అన్నాడు.

'యమదూతతో మాట్లాడాల్సిన పని ఉంది నాకు. ఇప్పుడ తను మనకు ఎంతో అపకారం చేసిన వ్యక్తి అని గ్రహించినా ఇంతకు ముందు కొన్ని సంద్భాలలో మనకతను సాయం చేశాడు. ముఖ్యంగా మహామాయ, మంత్రి సాధు తనకు

అడవిలో ఒకచోట కనిపించినట్టు నా కతను చెప్పాడు. వాళ్లను అనుసరించమని నేను ఆజ్ఞాపించాను. తర్వాతి విష యాలు నాకేమీ తెలియవు. ఏం జరిగిందీ తెలుసుకోవాలి. ఈ విషయాలన్నీ అతనితో మాట్లాడుతూ నేనతనిని రాయ దుర్గం తీసుకువస్తాను. ఈలోగా మీరుకూడా రాయదుర్గం చేరుకోండి. మనం విడివిడిగా వెడదాం. అక్కడికి వెళ్ళిం తర్వాత మిగిలిన విషయాలు చూసుకుందాం.'

ఈ ఉపాయం అందరికీ నచ్చింది. నరసింగభూపతితోసహా నర్మద, కళ్యాణి, మంత్రవాది ముందుగానే రాయదుర్గానికి బయలుదేరారు. భవాని ఆ భవనంలోనే ఉండిపోయింది. రఘు వీర్ మహారాజు యమదూతతోసహా ఆ భవనంలోంచి బయట పడ్డాడు.

అందరూ వెళ్లిపోయింతర్వాత భవాని నర్మద తనకు చెప్పిన మార్గంలో పడవను వెనక్కి నడుపుకువచ్చి భవనంలో ప్రవే శించింది. అప్పటివరకు ఎంతో సంవడిగా ఉన్న ఆ భవనంలో కాసేపట్లో నిశ్శబ్దం ఆవరించింది. భవాని ఏమీ తోచక నిశ్చ లంగా ఉన్న చెరువులోని నీటివంక చూస్తూ ఒకచోట కూర్చుండిపోయింది.

## 3

వాతావరణం ప్రశాంతంగా ఉంది. ఆకాశంలో నల్లని మబ్బులు దోబూచులాడుకుంటూ ప్రయాణం సాగిస్తున్నాయి. కాసేపు వాటిచాటున తమ అస్తిత్వాన్ని కోల్పోతూ కాసేపు దేదీప్యమానంగా వెలుగుతూ నక్షత్రాలు ఆకాశరంగంలో

అక్కడక్కడా కనిపిస్తున్నాయి. వాటి మధ్యగా చంద్రుడూ ప్రకాశిస్తున్నాడు.

యమదూత, రఘువీర్ మహారాజు అడవిలో ప్రయాణం సాగిస్తున్నారు. కీచుమనే శబ్దాలు తప్ప అంతటా నిశ్శబ్దంగా ఉంది. కాసేపటివరకు ఆ ఇద్దరిలో ఎవరూ మాట్లాడలేదుకూడా. తనమీదకు వచ్చిన నేరం కారణంగా యమదూత ఆయన ముందు తలెత్తి ఏమీ మాట్లాడలేకపోతున్నాడు.

చివరికి రఘువీర్ మహారాజు నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ అన్నాడు.

'మహామాయ, మంత్రి సాధు కనిపించారని చెప్పావు. వాళ్లను అనుసరించమని చెప్పాను. తర్వాత ఏం జరిగిందో నాకు తెలియనే లేదు.'

యమదూత ఆయనవంక తలెత్తి చూశాడు. తాను చేసిన అపరాధాలను గురించి అడగకుండా వేరే విషయాలను గురించి ఆయన ప్రసంగించడం అతనికి ఆనందం కలిగించింది. మెల్లిగా చెప్పడం ఆరంభించాడు.

'వాళ్లిద్దరూ తిన్నగా వెనుకటి రాయదుర్గాధిపతి కుమారుడు కిశోర్ దగ్గరకు వెళ్లారు. వాళ్ళిద్దరినీ అనుసరించి నేనూ వెళ్లాను.'

'కిశోర్ ఎక్కడ ఉంటున్నాడు?'

'పడమటి కొండల్లో ఒక రహస్యస్థలంలో భవనం ఏర్పాటు చేసుకున్నాడు.'

'వీళ్ళిద్దరూ అతని దగ్గరికి ఎందుకు వెళ్ళినట్టు?'

'సహాయం కోరడానికి.'

'అతనిసా సహాయం కోరేది? అతని దగ్గర ఏముందని?' మహారాజు పరిహాసంగా నవ్వుతూ అన్నాడు.

'అతనక్కడ కొంత సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని ఉంటున్నాడు. అతని ఉద్దేశ్యమేమిటో నాకు తెలియదు. మార్తాండుడు, అగ్నివర్మ అతనికి చేదోడు వాదోడుగా ఉంటున్నారు—,' యమదూత మధ్యలో ఆగాడు.

'చెప్పు. ఆగిపోయావెందుకు?' మహారాజు ప్రశ్నించాడు.

'అక్కడకూడా ఒక విచిత్రమైన విషయాన్ని నేను గమనించాను.'

'ఏమిటది?'

'చిత్ర గృహాధిపతి అగ్నివర్మను నేనే ఓసారి గొంతు పిసికి చంపాను. అతని దగ్గర ఉన్న తాళపు చెవుల గుత్తిని సంపాదించి అప్పుడు చిత్ర గృహంలో బందీలుగా ఉన్న నరేంద్ర మహారాజాదుల్ని విడిపించడం కోసం ఆ పని చేశాను. కాని అతనిని తిరిగి కిశోర్ దగ్గర చూడగానే నాకెంతో ఆశ్చర్యం కలిగింది.'

'నువ్వు చంపింది అగ్నివర్మనే అని నమ్మకంగా తెలుసా? అతని వేషంలో ఉన్న మరెవరైనా కాదుగదా?'

'యమదూత నవ్వాడు. నాకా విషయంలో ఏం సందేహం లేదు. నేను చంపింది అగ్నివర్మనే. మారువేషంలో ఉన్న ఏ వ్యక్తినీ కాదు. ఆ సమయంలో ఇతరులవద్ద తాళపుచెవుల గుత్తి ఉండడానికవకాశంలేదు,' అతనన్నాడు.

'అయితే కిశోర్ దగ్గర నువ్వు చూసిన వ్యక్తి అగ్నివర్మ రూపంలో ఉన్న గూఢచారి ఎవరో అయి ఉండాలి. అసలు అగ్నివర్మ చనిపోయినట్టు నీకుతప్ప మరెవరికీ తెలియదు. ఏదో ప్రయోజనాన్ని ఆశించి ఎవరో అగ్నివర్మ రూపం ధరించి కిశోర్ దగ్గర చేరి ఉండవచ్చు. అగ్నివర్మ చనిపోయినట్టు కిశోర్‌కు కూడా తెలిసి ఉండకపోవడంవల్ల అతనే అగ్నివర్మ అని నమ్మి ఉంటాడు కిశోర్,' మహారాజు అన్నాడు.

ఇది సంభవంగానే కనిపించింది యమదూతకు. ఒక్క క్షణం ఆ సంగతిని గురించి ఆలోచిస్తూ మౌనం వహించాడు.

'సరే. ఇక అసలు సంగతిని గురించి చెప్పు. మహామాయ, సాధు కిశోర్ సాయాన్ని అభ్యర్థించారా? అతనేమన్నాడు? తర్వాతేం జరిగింది?' మహారాజు ప్రశ్నించాడు.

యమదూత మళ్ళీ చెప్పడం ప్రారంభించాడు.

'మంత్రి సాధు కిశోర్‌కు సంగతి, సందర్భాలు వివరించి చెప్పి తమకు సాయం చెయ్యమని కోరాడు. అతనికి నేనే ఆశలు గొలిపాడుకూడా. రాత్రిపూట ఎవరికీ కనిపించకుండా నేనుకూడా ఆ భవనంలోకి ప్రవేశించి వాళ్ల సంభాషణను విన్నాను. తర్వాత కిశోర్ మార్తాండుడితోను, అగ్నివర్మ తోను మంతనాలు జరిపాడు. వాళ్లతనిని సాధుకు సహాయం చెయ్యమని ప్రోత్సహించారు. సరిగ్గా అదే సమయంలో నేనొక ఉత్తరం రాసి కిశోర్ దగ్గరకు విసరివేశాను. తర్వాత అక్కడినించి తప్పుకున్నాను. ఆ ఉత్తరంలో మహామాయకు, సాధుకు సాయం చేయవద్దని కిశోర్‌ను హెచ్చరించాను. ఆ

ఉత్తరం కిశోర్ మీద ఎటువంటి ప్రభావాన్ని చూపించో తెలియదు కాని అతను వాళ్లకు సాయం చేయనిరాకరించినట్టున్నాడు. అంతటితో వాళ్లు తిరుగుముఖం పట్టారు. తిరిగి వస్తూండగా వాళ్లని నేను కనిపించకుండా చాలాదూరం అనుసరించాను. మీరు ఉంటానన్న చోటిని సమీపించగానే వాళ్లని ఎదుర్కొన్నాను—' యమదూత అకస్మాత్తుగా ఆగిపోయాడు.

'తర్వాత వాళ్లేమయ్యారు?' మహారాజు సందేహంగా ప్రశ్నించాడు.

'వాళ్లతో మాట్లాడుతున్న సందర్భంలోనే ఆ వ్యక్తి వచ్చాడు. తర్వాత పరిస్థితులు విషమించాయి. అతనుకూడా వాళ్లపక్షాన మాట్లాడాడు. ముగ్గుర్ని నేనొక్కడినే ఎదిరించలేకపోయాను. నేను ఆ వ్యక్తితో మాట్లాడుతుండగా మహామాయ, మంత్రి సమయం చూసి జారుకున్నారు. మళ్ళీ కనిపించలేదు.' యమదూత అన్నాడు. అతనికి ఆ వ్యక్తినిగురించి చెప్పడం ఇష్టం లేకపోయినా చెప్పక తప్పలేదు.

రఘువీర్ మహారాజుకుకూడా ఆ సమయంలో నరసింగ భూపతికి సంబంధించిన విషయాలు మాట్లాడడం ఇష్టంలేదు. అయినా ఒక ప్రశ్న అడగకుండా ఉండలేకపోయాడు.

'నరసింగభూపతి మహామాయ, సాధు పారిపోవడానికి అనుకూలంగా ప్రవర్తించాడా?' ఆయన అడిగాడు.

'ఔను. అదే ఆశ్చర్యకరమైన సంగతి. తిరిగి మీ దగ్గరికి వచ్చింతర్వాత మీకు అప్పుడిలా మాట్లాడాడు,' యమదూత అన్నాడు.

రఘువీర్ మహారాజు ఇంకేమీ మాట్లాడ లేదు. మౌనంగా ఆలోచిస్తూ నడవసాగాడు. యమదూత, నరసింగభూపతి చెప్పిన విషయాలు పరస్పర విరుద్ధంగా కనిపిస్తున్నాయి. ఇందులో ఎవరు సరయిన వాళ్లో నిర్ణయించడం కష్టం. ఎన్నో ఘోరమైన పనులుచేసి తమకెంతో అపకారం చేసిన యమదూత నిజం చెప్పాడో, అబద్ధం చెప్పాడో గ్రహించడం సులభసాధ్యం కాదు.

ఇద్దరూ ఏవో విషయాలు ఆలోచిస్తూ మౌనంగా వస్తున్నారు. మసక వెన్నెలలో దారి కనిపిస్తూనే ఉంది. వాతావరణం హాయిగా ఉందికూడా. ప్రయాణం సుఖంగానే సాగుతోంది.

## 4

రాయదుర్గంలో ఈ మధ్య ఎటువంటి అలజడీ లేదు. అక్కడి పరిస్థితులన్నీ సక్రమంగానే ఉన్నాయి. ఆ కోటను నరేంద్ర మహారాజు ఆక్రమించుకోగానే కొంత సైన్యంతో సహా విక్రమ్‌ను అక్కడ ఉంచాడు. మిగిలిన సైన్యాన్ని కోటకు పంపి తాను మంత్రితోను తదితర ముఖ్యానుచరులతోను ప్రతాప్‌ను అన్వేషించడానికి బయలుదేరాడు.

రాయదుర్గాన్ని పరిపాలించడంలో విక్రమ్‌కు ఎటువంటి కష్టమూ కలగలేదు. ప్రజలు తమ కనుకూలంగా ఉన్నారు. తమను వ్యతిరేకించే వ్యక్తులెవరూ లేకపోయారు. అందుచేత పరిపాలనా విషయంలో ఎటువంటి ఇబ్బందులూ కలగలేదు.

అలా చాలాకాలం గడచిపోయింది. నరేంద్ర మహారాజు తంత్రహీణ్‌తో సహా కోటకు చేరుకున్నాడు. ఆయన అక్కడ ఉన్నా శత్రుస్థావరాలలో చిక్కిఉన్న రాకుమారులకు సంబంధించిన దిగులు ఆయనను వదలలేదు. మంత్రి ఎంతో ధైర్యం చెబుతూన్న కారణంగా ఆయన చివరికి మనస్సును నిలదొక్కుకోగలిగాడు.

ఇలా రోజులు గడుస్తున్న సమయంలో కాళి కోటలోకి వచ్చింది. భవానిపురంలో తమకు లభించిన కాళిని నర్మద మహారాజాదులకు ధైర్యం చెప్పడం కోసం కోటకు పంపింది. తాను చేయవలసిన సత్వర కర్తవ్యాలేం లేకపోవడంచేత కాళి కూడా ఆమె మాటప్రకారం నరేంద్రమహారాజాదుల దగ్గరికి వచ్చింది.

ఆమె వాళ్ళకు పరిస్థితులను వివరించి చెప్పింది. నర్మదను గురించి, ఆమె తమకు చేస్తున్న సహాయాలను గురించి ప్రశంసిస్తూ చెప్పింది. రాజకుమారులు ఆమె సహాయంవల్ల సులభంగా విడిపించబడగలరని నరేంద్రమహారాజుకు ధైర్యం చెప్పింది.

కాళి మాటలు వింటే ఆయనకు పట్టరానంత ఆనందం కలిగింది. కాళి చెబుతున్న నర్మద వగైరాలే కాక తమ ముఖ్య గూఢచారులు మంత్రవాది, నేపాళికూడా అక్కడే ఉన్నారు. తాత్కాలికంగా బందీలుగా ఉన్న వాళ్లుకూడా రాజకుమారుల్ని విడిపించడానికి శాయశక్తులా ప్రయత్నిస్తారు.

నరేంద్రమహారాజు మనస్సు కుదుటపడినట్టయింది. తదనంతరం కాళి మహారాజుగారేం చెబితే అది చెయ్యాలని నిర్ణ

యించుకుంది. అంతకుమించి తనకు ప్రస్తుతం వేరే పనికూడా ఏమీ లేదు.

'ఇక్కడ గూఢచారులుకూడా ఎవరూ లేరు. నువ్వు ఇక్కడే ఉండిపో కొంతకాలం,' అన్నాడు నరేంద్రమహారాజు.

తానుకూడా కొంతకాలం విశ్రాంతి తీసుకోవడం మంచి దనుకుంది కాళి. తర్వాత ఏదైనా పెద్ద పని తగిలితే మరింత ఉత్సాహంతో ముందుకుదూకి పురోగమించవచ్చు. అప్పటి నించి కాళి నరేంద్రమహారాజు కోటలోనే ఉంది.

ఇలా కొన్ని రోజులు గడిచాయి. కోటకు రాజకుమారులకు సంబంధించిన వార్తలుగాని, కిరణ్మయి, లావణ్యలకు సంబంధించిన వార్తలుగాని ఏమీ అందడంలేదు. మహారాజు కాళిని పిలిపించాడు.

ఓసారి వెళ్లి సంగతి సందర్భాలు తెలుసుకువస్తే బాగుంటుంది,' అన్నాడాయన.

కాళికికూడా కిరణ్మయి ఏమైందో, ఎలా ఉందో తెలుసుకోవాలని ఆరాటంగా ఉంది. తాను తగినంత విశ్రాంతి తీసుకుందికూడా. తిరిగి అడవుల్లోకి కార్యార్థం బయలుదేరడానికి పూనుకుంది.

సరిగ్గా అదే సమయానికి ఒక భటుడువచ్చి మహారాజుకు మంత్రవాది వచ్చినట్టుగా వార్త అందించాడు. ఈ సంగతి వినగానే వార్తలు తెలుసుకోవాలని అందరికీ కుతూహలం కలిగింది. వెంటనే మంత్రవాదిని తన దగ్గరకు తీసుకురమ్మని మహారాజు భటుడి కాజ్ఞాపించాడు.

మంత్రవాది ద్వారా రాజకుమారుల క్షేమ వార్తలు, రఘువీర్ మహారాజు విషయం అందరికీ తెలిశాయి. రాజకుమారులు విడిపించబడ్డారన్న వార్త వినగానే నరేంద్ర మహారాజా ఆనందానికి మేరలేక పోయింది. రఘువీర్ మహారాజు, నేపాళి కిరణ్మయి, లావణ్యలను విడిపించడానికి వెళ్లారని మంత్రవాది నోటవిన్న కాళి మనసు్సు ప్రశాంతిని పొందింది.

మంత్రవాది తన కర్తవ్యాన్ని ముగించుకొని వెళ్లిపోయాడు. కాళి ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేకపోయింది. కోటలోనే ఉండిపోయింది. కిరణ్మయిని లావణ్యను విడిపించిం తర్వాత నేపాళి వాళ్లిద్దరినీ కోటకే తీసుకువస్తాడని మంత్రవాది చెప్పాడు. ఈవార్త కాళికి మరింత ఆనందాన్ని కలిగించింది. వాళ్లకోసం ఎదురు తెన్నులు చూడసాగింది.

ముగ్గురూ అప్తులే. కిరణ్మయి నిజానికి తనకు యజమానురాలు. అయితే లావణ్య పట్లకూడా కాళికి గాఢమైన అభిమానం ఉంది. ఇక నేపాళి విషయం చెప్పనక్కర లేదు. ఆ పేరు వినగానే ఆమె హృదయంలో అణగిపోయి ఉన్న ప్రేమ పెల్లుబికింది.

ఆ తర్వాత కొద్దిరోజుల్లోనే నేపాళి కిరణ్మయిని లావణ్యను వెంటపెట్టుకుని కోటకు చేరుకున్నాడు. ఆ ముగ్గుర్నీ చూడగానే నరేంద్రమహారాజుకు రాజకుమారుల్ని చూసినంత ఆనందం కలిగింది.

పరిస్థితులు తమకనుకూలంగా ఉన్నందుకు అందరికీ ఆనందంగానే ఉంది. త్వరలోనే తమ కష్టాలన్నీ తీరిపోయి రాజకుమారుల్నికూడా చూడగలమని అందరూ ఆనందించసాగారు.

గడిచిన సంఘటనలను తలచుకుంటే ఆనంద విషాదాశ్చర్యాలు అందరి మనసుల్ని పెనవేసుకోసాగాయి. విచిత్రం, కాకపోతే ఇలాంటి సంఘటనలు ఎందుకు జరిగినట్టు!

చాలా కాలానికి కిరణ్మయిని, లావణ్యను అనుకూల పరిస్థితులలో చూడగలిగినందుకు కాళి హృదయం ఆనందంతో ఉప్పొంగి పోయింది. ఇన్ని కష్టాల తర్వాత, తన ఆప్తురాలిని కలుసుకున్నందుకు కిరణ్మయి ఎంతో సంతోషించింది.

నేపాళికి కాళి ఇక్కడ ఉందన్న విషయం తెలియనే తెలియదు. ఆమెను అకస్మాత్తుగా చూడగానే అతనికి ఆశ్చర్యానందాలు కలిగాయి. ఇద్దరి హృదయాలలో నివురుగప్పి ఉన్న ప్రేమాగ్ని వేడినిట్టూర్పుల్ని విడవసాగింది.

రాయదుర్గం వెళ్ళి అక్కడే ఉండి అక్కడి పరిస్థితులు చక్కబెట్టవలసిందిగా నరేంద్ర మహారాజు నేపాళిని ఆజ్ఞాపించాడు. నేపాళి తనకు సహాయకురాలుగా కాళిని కూడా అక్కడికి తీసుకు వెళ్తానని తన కోరికను వెల్లడించాడు. అందుకు మహారాజు అనుమతి సులభంగానే లభించింది.

కొద్దిరోజుల్లో కాళి నేపాళి రాయదుర్గం చేరుకున్నారు. ఇద్దరూ అక్కడ విక్రమ్‌కు సహాయకులుగా ఉండసాగారు. ముఖ్యంగా చిత్రగృహానికి సంబంధించిన విషయాలన్నీ నేపాళి చూస్తున్నాడు.

సర్వసైన్యాధిపతి విక్రమ్, నేపాళి ఏకాంతంగా కూర్చుని మాట్లాడుకుంటున్నారు. ఆ సమయంలో గూఢచారి ఒకడు గది ముంగిటకు వచ్చి నిలబడ్డాడు.

'చెప్పవలసిన విశేషాలేమైనా ఉన్నాయా?' విక్రమ్ అడిగాడు.

గూఢచారి వెంటనే సమాధానమిచ్చాడు.

'మంత్రవాదిగారు మరి ఇద్దరు ముగ్గురు వ్యక్తులతో ఇక్కడికి వస్తున్నారు. అడవిలో గుర్రంమీద ఎక్కడికో బయలుదేరి వెళ్తున్న నాకు అకస్మాత్తుగా కనిపించారు. ఈ వార్త తమ కందచేయమని నన్నాజ్ఞాపించారు. అందుకే వెనక్కి తిరిగి వచ్చాను.

'మంత్రవాదితోపాటు ఉన్న వ్యక్తులెవరో నీకు తెలియదా?' విక్రమ్ మళ్లీ ప్రశ్నించాడు.

'తెలియదండి. ఎప్పుడూ చూసిన గుర్తులేదు,' గూఢచారి సమాధానమిచ్చాడు.

'స్త్రీలా? పురుషులా?' నేపాళి అడిగాడీసారి.

'ఇద్దరు స్త్రీలు. ఒకాయన రాజులా ఉన్నాడు,' భటుడన్నాడు.

కాసేపాలోచించి నేపాళి అన్నాడు.

'నర్మద, భవాని, రఘువీర్ మహారాజు అయిఉంటారు. ఏం పనిమీద ఇక్కడికి వస్తున్నారో మరి!'

విక్రమ్ అనుమతిమీద గూఢచారి అక్కడినించి వెళ్లిపోయాడు.

'ఎలాగో వాళ్లు వస్తున్న వార్త తెలిసిందికాబట్టి నేను ఎదురు వెళ్తాను,' అన్నాడు నేపాళి విక్రమ్‌తో.

ఈ వార్త కాసేపట్లో కాళికి కూడా తెలియచేయ బడింది. వాళ్లీ సమయంలో ఇక్కడికి వస్తున్నందుకు కారణం తెలియక

పోయినా చాలా కాలానికి మళ్లీ నర్మదను మంత్రవాది వగైరాలను చూడబోతున్నందుకు ఆమెకు ఆనందం కలిగింది.

రఘువీర్ మహారాజునుగురించి నేపాళి చెప్పగా విన్నది కాని కాళి ఇంతకు ముందాయనను చూసి ఉండలేదు. అందుచేత ఆయనను కూడా చూడవచ్చునని ఆమె అనుకుంది.

'నేను కూడా మీతో పాటు వస్తాను. ఇద్దరం కలిసి వెళ్దాం,' అంది కాళి నేపాళితో అతను ఒంటరిగా బయలుదేరుతున్న సమయంలో.

నేపాళి అందు కానందంతో అంగీకరించాడు. ఇద్దరూ తక్షణం మంత్రవాది వగైరాలకు ఎదురువెళ్లి తీసుకురావడానికి బయలుదేరారు.

## 5

తమకెదురువచ్చిన నేపాళిని కాళిని చూడగానే మంత్రవాది వగైరాలకు ఆశ్చర్యానందాలు కలిగాయి. కాళి, నేపాళి రాయదుర్గంలో ఉన్నట్టు ఎవరికీ తెలియదు. ఎవరూ ఊహించలేదుకూడా. అందుచేత వాళ్లనక్కడ అకస్మాత్తుగా చూడగానే ఆనందంతోపాటు ఆశ్చర్యంకూడా కలిగింది.

నర్మదకు నమస్కారం చేస్తూ ఆమెవంక ఆనందంగా చూసింది కాళి. కాని ఆమె ప్రక్కనే ఉన్న రెండవ ఆమెనుగాని, ఆ ప్రక్కనే ఉన్న వ్యక్తినిగాని కాళి ఏమాత్రం గుర్తుపట్టలేకపోయింది. నేపాళికూడా వాళ్లిద్దరివంకా వింతగా చూడసాగాడు. తాననుకున్నట్టు వాళ్లిద్దరూ భవాని, రఘువీర్

షువాలీరాజు కాదు. మరెవరైనా ఉంటారా అని సేపాళి ఆలోచించాడు కాని ఎంతసేపటికీ ఏమీ తట్టలేదు. వాళ్లవంక ప్రశ్నార్థకంగా చూస్తూ నిలబడ్డాడు.

మంత్రవాది వాళ్లను గురించి కాళికి సేపాళికి చెప్పి చివరికిలా అన్నాడు.

'ఇంకా మీరు తెలుసుకోవాల్సిన విషయాలు చాలా ఉన్నాయి. కోటలోకి వెళ్లింతర్వాత వాటిని గురించి వివరంగా మాట్లాడుకుందాం. ఇప్పుడు ఆతురత చెందవలసిన పని లేదు.'

అందరూ రాయదుర్గంలోకి చేరుకునే సరికి సూర్యుడు ఆకాశంలో తేజోవంతంగా ప్రకాశిస్తున్నాడు. అతిథుల కోసం విక్రమ్ ముందుగానే అన్ని ఏర్పాట్లూ చేసి ఉంచాడు.

రాయదుర్గాధిపతి చనిపోయింతర్వాత కోటలో ఉండే అతని ముఖ్యానుచరులందరు తలొక దారిన పోయారు. కోటలోని భవనాలు చాలావరకు ఖాళీగానే ఉన్నాయి. ప్రధాన భవనంలో విక్రమ్ ఉంటున్నాడు. చుట్టూ ఉన్న కొన్ని భవనాలలో అతని ముఖ్యానుచరులు కొందరుంటున్నారు.

కాళి, సేపాళి ఒక భవనాన్ని ఆక్రమించారు. ఇప్పుడతిథులకోసం మరొక రెండు భవనాలలో ఏర్పాట్లు చేయబడ్డాయి. మంత్రవాది విక్రమ్‌కుకూడా అతిథులను పరిచయం చేశాడు. అతనికందరూ కొత్తవాళ్లే.

'భోజనాదికాలు ముగించి ప్రయాణపుబడలిక తీర్చుకోండి. తర్వాత తీరుబడిగా అన్ని విషయాలూ మాట్లాడుకుందాం,' విక్రమ్ అన్నాడు.

'రఘువీర్ మహారాజుగారు కూడా వస్తారు. ఆయనకోసం కూడా ఏర్పాట్లు చేయించాలి,' మంత్రవాది విక్రమ్‌తో అన్నాడు.

విక్రమ్ తన పనిమీద వెళ్లిపోయాడు. నేపాళి, కాళి అతిథులకు తగిన వసతులు సమకూర్చే ప్రయత్నంలో ఉన్నారు. కళ్యాణి రాయదుర్గంలోని చక్కని భవనాలను చూస్తూ ఆనందించసాగింది.

ఎవరి పనులలో వాళ్లుండిపోయారు. అన్ని వైపులా నిశ్శబ్దంగా ఉంది. మంత్రవాది నేపాళిని పిలిచాడు.

'రఘువీర్ మహారాజుగారితో పాటు యమదూతకూడా వస్తాడు. రాగానే అతనిని చిత్రగృహంలో బంధించే ఏర్పాటు చెయ్యాలి నువ్వు,' అన్నాడు.

ఈమాట వినగానే నేపాళికి ఆశ్చర్యం కలిగింది. యమదూత తమకనేకసార్లు సాయం చేసిన సంగతి అతనికి తెలుసు. ముఖ్యంగా నరేంద్రమహారాజాదుల్ని చిత్రగృహంలో బందీలుగా ఉన్నప్పుడు విడిపించిన విషయం, కిరణ్మయిని, లావణ్యను మంథర భవనంలోంచి విడిపించేప్పుడు తమకు సాయపడిన విషయం అతను మర్చిపోలేదు.

'యమదూతను బంధించాల్సిన అవసరం ఎందుకు కలిగింది?' నేపాళి మంత్రవాది నడిగాడు.

నర్మద భవనంలో జరిగిన సంఘటనలన్నీ మంత్రవాది నేపాళికి వివరించి చెప్పాడు.

'అందుకోసమే మేమిక్కడికి వచ్చాం. యమదూతను రాగానే బంధించే ఏర్పాట్లు చెయ్యమని విక్రమ్‌తో చెప్పినా

సరే లేక నువ్వే స్వయంగా ఆ పని చేసినా సరే,' అన్నాడు చివరికి మంత్రవాది.

'సరే. అందుకు తగిన ఏర్పాట్లు ఏదో విధంగా నేను చేస్తాను,' అన్నాడు నేపాళి.

క్రమంగా మధ్యాహ్నం గడచిపోయింది. సాయంకాలం చల్లని వెలుగును ప్రసాదిస్తూ వచ్చింది. గాయదుర్గంలో ప్రకృతి సౌందర్యానికి కొదవలేదు. ప్రకృతి సౌందర్యాన్ని ఆనందంతో తిలకిస్తూ తీరుబడిగా మాట్లాడుకుంటూ ఉన్న సమయంలో రఘువీర్ మహారాజు యమదూతతో సహా వచ్చినవార్త కోటలో వాళ్ళ కందింది.

వెంటనే విక్రమ్ అక్కడినించి లేచి వెళ్ళాడు. మంత్రవాది, నేపాళి మరో ప్రక్కకు వెళ్ళారు. కాస్సేపటికి రఘువీర్ మహారాజును ఒక్కడినే వెంటపెట్టుకు వచ్చారు. ఆయన కోసం ఏర్పాటుచేయబడిన భవనంలోకి తీసుకువెళ్ళిం తర్వాత ఆయనకు కావలసిన వస్తువుల్ని సమకూర్చేటా చేశారు.

విక్రమ్ ఇద్దరు అనుచరులతో యమదూత నిలబడి ఉన్న చోటికి వెళ్ళాడు. రఘువీర్ మహారాజు అతనినక్కడ ఉండమనిచెప్పి కోటలోపలికి వెళ్ళాడు. యమదూత మాత్రం ప్రధాన ద్వారం దగ్గరే నిలబడ్డాడు.

విక్రమ్ ఆజ్ఞ మీద కాపలావాళ్లు యమదూతనుకూడా లోపలికి రానిచ్చారు. కాని యమదూతకెందుకో ఇక్కడి పరిస్థితుల్ని చూస్తే అనుమానంగానే ఉంది. అయినా ఏమీ అనలేదు. నెమ్మదిగా కోటలోపలికి ప్రవేశించాడు తానుకూడా. వెంటనే విక్రమ్ తన అనుచరులకేదో సంజ్ఞ చేశాడు.

వాళ్లు యమదూతను బంధించడానికి ముందుకు దూకారు. ఇదంతా చూస్తే అతనికి విభ్రాంతి కలిగింది. రఘువీర్ మహారాజు నమ్మకంగా తన నిక్కడికి తీసుకువచ్చిందిందుకేనా!

'ఏమిటిది?' యమదూత విక్రమ్ వైపు చూస్తూ అడిగాడు.

'కోటలోకి ప్రవేశించగానే నిన్ను బంధించవలసిందిగా నాకు తెలియచేయబడింది,' అన్నాడు విక్రమ్.

'నన్నెందుకు బంధిస్తున్నదీ కారణం చెప్పగలరా?' యమదూత దీనంగా అన్నాడు.

'అవన్నీ నాకు తెలియవు. నర్మదగారి దగ్గరినుండి నాకీ వర్తమానం చేరింది. నువ్వు వాళ్ల కేదో అపకారం చేసినట్లు నాకు తెలిసింది,' అన్నాడు సమాధానంగా విక్రమ్.

యమదూత ఓసారి గట్టిగా నిట్టూర్చాడు.

'అతను వేసిన వలలో వీళ్లంతా చిక్కుకున్నారు. చివరికి నన్నే అందరూ అనుమానిస్తున్నారు. అతని పన్నాగానికి ఎలాంటి ఫలితం కనిపిస్తుందో!' తనలో తాను అనుకుంటున్నట్టుగా అన్నాడు యమదూత.

'పోనీ నీమీద అనుమానం తొలగిపోయేందుకు తగిన ఋజువులు నువ్వు చూపించవచ్చుగా,' విక్రమ్ అన్నాడు.

'అసలు నా మాట వినేదెవరు?' యమదూత నిరాశగా అన్నాడు.

'అందరూ ఇక్కడే ఉన్నారు. నర్మద కళ్యాణి వగైరా అందరూ ఇక్కడికి వచ్చారు,' విక్రమ్ అన్నాడు.

యమదూత ఆశ్చర్యంగా అడిగాడు.

'ఎప్పుడు వచ్చారు?'

'మీకంటే ముందే. మధ్యాహ్నానికే వచ్చారు.'

'అయితే ఇదంతా ముందుగా అనుకుని చేసిన పనేనన్న మాట,' యమదూత తనలో అనుకున్నాడు.

అప్పటికే అతని చేతులు బంధించబడ్డాయి. విక్రమ్ అతని ముఖంవంక చూశాడు. చాలా దీనంగా ఉంది అతని ముఖం.

'తీసుకువెళ్ళి చిత్రగృహంలో బంధించండి.' విక్రమ్ తన అనుచరుల కాజ్ఞాపించాడు.

వాళ్లు యమదూతను చిత్రగృహంవైపు తీసుకువెళ్ళారు. తలవంచుకుని ఏదో ఆలోచిస్తూ వాళ్లతోపాటు ముందుకు సాగాడు యమదూత. అప్పటికి సూర్యుడస్తమించేవేళయింది. అరుణకాంతులు అంతటా ఆవరిస్తున్నాయి.

విక్రమ్ తిరిగి వెళ్లేసరికి మంత్రవాది, నేపాళి, రఘువీర్ మహారాజు, నరసింగభూపతి ప్రశాంతంగా కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

'యమదూతను చిత్రగృహంలో బంధించాను. తర్వాత జరగవలసిన పనులను గురించి మీరు ఆలోచించుకోనండి,' అన్నాడు విక్రమ్.

దుర్మార్గుణ్ణి తగిన రీతిగా హింసించాలి,' అన్నాడు నరసింగభూపతి కసికొద్దీ.

మిగిలిన వాళ్లందరూ ఆయనవంక చూస్తూ మౌనంగా ఉండిపోయారు. యమదూత మీద ఆయనకున్న ఆగ్రహం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. క్రమంగా అరుణకాంతులుకూడా పోయి చీకటి అలముకోనసాగింది.

# 6

నెలబాలుని మసక వెన్నెల దిగంతాలదాకా వ్యాపించింది. ఆకాశం స్వచ్ఛంగా ఉంది. మేఘాలతో నక్షత్రాలు ఆటలాడుకుంటున్నాయి. చంద్రుడు ఓ ప్రక్కగా నిలబడి ఈ వింత ఆటను తిలకిస్తున్నాడు.

రాయదుర్గంలోని ఒక భవనం పై భాగంలో నర్మద, కళ్యాణి, కాళి కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. పరిస్థితులన్నీ సక్రమంగానే ఉన్నాయి. దేనికీ ఆరాటపడవలసిన అవసరం కానీ, ఆతురత చెందవలసిన స్థితిగానీ లేవు.

భవనం మీదినించి చూస్తే ఊరంతా ఎంతో అందంగా కనిపిస్తోంది. బారులుతీర్చి ఉన్న వీధులు, వీధులలో అక్కడక్కడా వెలుగుతున్న దీపాలు చక్కగా కనిపిస్తున్నాయి. ఊరికి దూరంగా అన్ని వైపులా వ్యాపించి ఉన్న దట్టమైన అరణ్యం, అందులోని పచ్చని పెద్దపెద్ద చెట్లు అస్పష్టంగా కారుమబ్బులు ఆవరించినట్టుగా కనిపిస్తున్నాయి.

వాతావరణం ప్రశాంతంగా ఉంది. చల్లనిగాలి శరీరాన్ని పులకరింప చేస్తోంది. చాలా కాలానికి కలుసుకున్న ఆప్తుల హృదయాలు అసలే ఆనందంతో పొంగిపోతున్నాయి. ఆ ఆనందాన్ని ఇనుమడింప చేస్తోంది వెన్నెల. నిశ్శబ్దం అన్ని ప్రక్కలా గంభీరంగా ఆవరించి ఉంది. నర్మద, కాళి చాలా సార్లు రాయదుర్గాన్ని, చిత్రగృహాన్ని చూశారు. కానీ కళ్యాణి మాత్రం చూడలేదు. అందుచేత ఆమె చూపు నిలకడగా లేకుండా చుట్టూ ఉన్న భవనాల వైపు తిరుగుతూనే

ఉంది. ఆమె అందులో చిత్రగృహం ఏదో సరిగా నిర్ణ యించుకొన లేకుండా ఉంది.

తానిది వరకు విన్న వర్ణనలను బట్టి చిత్రగృహం ఫలానా చోట ఉండొ ఉంటుందని గ్రహించినా మసక వెన్నెలలో సరిగా ఒక నిర్ధారణకు రాలేకుండా ఉంది. పైగా చుట్టూ ఉన్న చాలా భవనాలకు తాళాలు వేసి ఉన్నాయి. అందుచేత తాళంవేసి ఉన్నదేదో అదే చిత్రగృహం ఆమె ఎలా అనుకొనగలదు!

ఏమిటి అంత వింతగా చూస్తున్నారు?' అంది తాళి తమకు నూతనంగా ఏర్పడిన పరిచయాన్ని పురస్కరించుకొని కళ్యా ణితో.

ఏమీలేదు. చిత్రగృహం ఎక్కడ ఉందా అని చూస్తు న్నాను. చిత్రగృహాన్ని గురించి అనేకసార్లు విన్నాను. కాని నేను ఎన్నడూ చూడలేదు,' అంది కాళికి సమాధానంగా కళ్యాణి.

కాళి నవ్వింది. ఓసారి నర్మదవంక చూసి తిరిగి కళ్యాణితో అంది.

'అదిగో అకనిపించేదే చిత్రగృహం. మిగిలిన భవనాలలా ఎత్తుగా లేకుండా నేలమీదకే ఉన్నట్టు కనిపిస్తోంది.'

కళ్యాణి కాళి వ్రేలుపెట్టి చూపించినవైపు చూసింది. పైకి అది చాలా చిన్నదిలా ఆమెకు కనిపించింది. దానిని తాను రెండు మూడుసార్లు చూసినా అదే చిత్రగృహమై ఉంటుం దన్న అనుమానం ఆమెకు కలగలేదు. కాసేపు వింతగా ఆ వైపే చూస్తూ ఉండిపోయింది.

'ఇప్పుడు మనం కూర్చున్న భవనంలోనే రాయదుర్గాధిపతి కిరణ్మయిని ఉంచినట్టున్నాడు,' కాళి అకస్మాత్తుగా అంది.

ఈమాట వినగానే నర్మద చిరునవ్వు నవ్వింది. ఆమె ఎందుకు నవ్విందో కాళికి అర్థం కాలేదు. నర్మద ముఖం వంక చూసింది. కాని ఆమె కాళివంక చూడలేదు.

'కిరణ్మయి పేరెత్తగానే నాకేవేవో సంగతులు గుర్తు వచ్చాయి. ఆమె ఇక్కడ ఉండగా జరిగిన అనేక విచిత్ర సంఘటనలు తలచుకుంటే నాకు నవ్వు వస్తోంది,' నర్మద అంది.

ఈసారి కళ్యాణికూడా ఆమెవంక చూసింది. 'అదేమిటో చెబితే మేమూ ఆనందిస్తాంగా,' అంది.

ఆమె మాట వినిపించుకోనట్టుగా నర్మద మళ్ళీ అంది.

'ఈ సమయంలో భవానికూడా మనతోపాటు ఉంటే ఎంతో బాగుండేది. నాకంటే ఎక్కువ విషయాలు భవానికి తెలుసు.'

'భవాని ఎవరు?' కాళి ఆతురతగా ప్రశ్నించింది.

'మహామాయ సభలో ఆమెకు కుడిప్రక్కగా ఉన్న యువతి. భవాని మాసోదరి అని చెప్పానుకదూ! ఆమే నాను వదలి ఇప్పుడు నా దగ్గర ఉంటోంది.' అంది నర్మద.

'అప్పటి కిరణ్మయి సంగతులు భవానికెలా తెలుసు?' కళ్యాణి కూడా ఆశ్చర్యంగా అడిగింది.

కిరణ్మయి ఇక్కడున్న సమయంలో భవానికూడా ఇక్కడుంది. మహామాయ పంపగా కుంతి అనే పేరుతో కిరణ్మయికి సన్నిహితురాలిలా ప్రవర్తిస్తూ ఆమెను మోసగించ

డానికి భవాని ఇక్కడికి వచ్చి ఉంది. అప్పటి అనేక వింత వింత విషయాలు భవాని చెప్పగా విన్నాను,' అంది నర్మద.

కాళి కేదో అకస్మాత్తుగా గుర్తు వచ్చింది. నర్మదవంక చూసి నెమ్మదిగా అంది.

'యమదూతను చిత్రగృహంలో బంధించినట్టుగా నేపాళి ద్వారా నాకు తెలిసింది. యమదూత మనకు సాయం చేసే వ్యక్తి అని మీరే నాకు భవానీపురంలో చెప్పారు. మరి అతని నిప్పుడెందుకు బంధించవలసి వచ్చిందో నాకర్థం కాకుండా ఉంది.'

'అదొక పెద్ద కథ. ఆ సంగతులింకా నీకు తెలియవన్న మాట. ఈమధ్య అనేక వింత వింత విషయాలు బయటపడి నాయి. అందులో ఈ యమదూత చరిత్ర ఒకటి. అతను మా కుటుంబానికి క్షమించరానంత అపకారం చేశాడు. అతని మూలంగానే అందరం ఇన్ని కష్టాలనుభవించాల్సి వచ్చిందని చెప్పవచ్చు,' నర్మద అంది.

'నేపాళిద్వారా రఘువీర్ మహారాజుగారి విషయం మాత్రం విన్నాను. అంతకుమించి నాకేం తెలియదు. అన్ని విషయాలూ వివరంగా చెప్పవలసిందిగా అడుగుతున్నాను,' కాళి అంది.

నర్మద మహామాయకు సంబంధించిన విషయాలు, యమ దూతకు సంబంధించిన విషయాలు అన్నీ వివరించి చెప్పింది కాళికి. ఇవన్నీ వినగానే కాళికి అంతులేని ఆశ్చర్యం కలిగింది.

'ఆమె మీ అక్క అని మీరే చెప్పారుకదూ?' ఆమె అడిగింది.

'నిన్న మొన్నటివరకు అందరం ఆలాగే భావిస్తూ వచ్చాం. ఈ సంగతులన్నీ మాకేం తెలుసు? నిన్నటివరకు మాకే విషయాలూ రూఢిగా తెలియవు. ఇలా జరగడానికంతటికీ కారకుడైన యమదూత నాకు అనుచరుడుగా ఉంటూ కూడా ఈ విషయాలెన్నడూ చెప్పలేదు. నాకు ఘోరమైన అపకారాలు చేసి, కూడా నావల్ల ఎన్నో సాయాలు పొందాడు. దుర్మార్గుడు. తగినట్టుగా శిక్షించడం ఎలాగా అని ఆలోచిస్తున్నాను,' నర్మద తాత్కాలికంగా పొంగివచ్చిన ఆగ్రహంలో ఆవేశంతో అంది.

నర్మద ఆవేశంలో ఉన్న విషయం గమనించిన కాళిగాని, కళ్యాణిగాని కాసేపటివరకు మాటాడలేదు. ఆమె ముఖం వంక చూస్తూ మౌనం వహించారు. నర్మద ఆవేశంలోంచి తేరుకుని అక్కకేసి చూసింది.

'ఊహించలేని సంఘటనలు ఏకకాలంలో జరిగినట్టు తెలిసింది. వివరాలుమాత్రం ఇంకా నాకు తెలియనే లేదు. నీ వివాహంకి సంబంధించినప్పటి నుండి జరిగిన విషయాలు నీకు తెలిసినవి చెబితే బాగుంటుంది,' ఆమె అంది.

కళ్యాణి పైకి చిరునవ్వు నవ్వింది. కాని గడచిన సంఘటనలను తలచుకుంటూంటే ఆమె హృదయం స్తంభించిపోసాగింది. చివరికి గుండెల్ని చిక్కబట్టుకుని నెమ్మదిగా చెప్పనారంభించింది.

'నాకు తెలిసినంతవరకు అన్ని విషయాలూ చెబుతాను. రఘువీర్ మహారాజుగారితో పెళ్ళి ఖాయమైంది. ముహూర్తపు రోజున అనవాయితీ ప్రకారం ఆయన మంత్రి సాధు ఆయన

ఖడ్గరాజ్తో బయలుదేరి మన భవనానికి వచ్చాడు. మన దగ్గర జరగవలసిన కార్యాలన్నీ జరిగిపోయాయి. చివరికి నాన్నగారు నన్ను మీనాలో ఎక్కించి కొందరు భటులను వెంట పెట్టుకుని మంత్రి సాధుతో మహారాజుగారి దగ్గరికి ప్రయాణం కట్టారు,' ఒకసారి ఆగి ఆమె మళ్ళీ చెప్పింది.

దారిలో అరణ్యంలో జరిగిన సంఘటన తలచుకుంటే ఇప్పుడు కూడా నా గుండె బరువెక్కుతోంది. ఒక బందిపోటు దొంగల ముఠా మా మీదికి వచ్చింది. మీనా తలుపులు తెరచి నేను చూశాను. మన భటులతో పాటు నాన్న ఆ దొంగలతో తలపడ్డారు. ఎక్కువమంది ఉన్న ఆ దొంగల ముఠా చేతిలో మన భటులు ప్రాణాలర్పించారు. నాన్నగారు కూడా గాయపడి వాళ్ల చేజిక్కారు. వాళ్లు ఆయనను బంధిస్తూన్న సమయంలో నేను చూడలేక పోయాను. కళ్ల ముందు మసక క్రమ్మినట్టయింది. భూమ్యాకాశాలు తిరిగి పోతున్నట్టుగా అనిపించింది తర్వాతేం జరిగిందీ నాకు తెలియదు. నాకు స్పృహ తప్పిపోయింది.

'అదే యమదూత్ దొంగల ముఠా అయి ఉంటుంది. అప్పుడే ఇందిరను నీ స్థానంలో కూర్చోబెట్టి నిన్ను తీసుకు వెళ్ళి ఉంటారు,' నర్మద మధ్యలో అంది.

కళ్యాణి మళ్లీ చెప్పసాగింది.

'నాకు స్పృహ వచ్చేసరికి నేనొక బందిఖానాలో ఉన్నాను. నన్నెవరు బంధించిందీ, ఎందుకు బంధించిందీ చాలా కాలంవరకు అర్థం కాలేదు. అలాగే తినీ తినకా ఖైదు

గోడలమధ్య కాలం గడిపాను. మధ్యలో అప్పుడప్పుడూ రఘువీర్ మహారాజుగారి మంత్రి సాధు వచ్చి నన్ను చూసి పోతుండేవాడు. అతనే ఒకసారి నాకన్ని విషయాలూ చెప్పాడు. నా బదులుగా మరో స్త్రీని మహారాణిని చేసినట్టు, నాన్నగారిని కూడా మరోచోట బంధించినట్టు నాకు తెలిసింది. నేను ఎల్లకాలం ఖైదులోనే ఉంటాననే ధీమాతో అతను నాకా విషయాలు చెప్పాడు.'

మధ్యలో ఆమెను ఆపి నర్మద అంది.

'వివాహానంతరం నిన్ను నాన్నగారు మహారాజు గారిదగ్గరికి మీనాలో తీసుకువెళ్ళిన సంగతి గుర్తుంది. అప్పుడు నేను, అమ్మ, భవాని ఇంట్లోనే ఉన్నాం. తర్వాత కొద్దిరోజులికి నాన్న అరణ్యంలోకి ఏదో పనిమీద వెళ్ళినప్పుడు అడవి పులి నోట పడ్డారని తిరిగివచ్చిన భటులు చెప్పారు. నాన్నగారు చనిపోయిన దిగులుతో అమ్మకూడా కొద్ది రోజులికి కృశించి చనిపోయింది. తర్వాత నేను, భవాని బావగారిదగ్గరికి పోయాం. ఇదంతా ఎందుకు చెప్పానంటే నాన్నగారిని కూడా మరో చోట బంధించినట్టు మంత్రి సాధు నీతో చెప్పినట్టు నువ్వన్నావు. మరి తర్వాత ఇంటికివచ్చి మాతో ఉన్నాయన ఎవరా అని నాకు సందేహంగా ఉంది.'

'ఎవరైనా తాత్కాలికంగా మిమ్మల్ని మధ్య పెట్టడం కొరకు మీ నాన్నగారి వేషంలోవచ్చి మీదగ్గర ఉన్నారేమో,' కాళి అంది.

'అయి ఉండవచ్చు. అలా మారువేషం వేసుకువచ్చిన వ్యక్తి నిజానికి పులి వాత పడి ఉండకపోవచ్చు. అదంతా

నాటకమన్న మాట. ఆ వ్యక్తినే ఇప్పుడు యమదూత కూడా చూపిస్తావంటున్నావేమో,' నర్మద సందేహంగా అంది.

కాళి దృష్టి అకస్మాత్తుగా చిత్రగృహం మీద పడింది. ఆమె ఉలిక్కి పడింది. దీక్షగా అలాగే చూస్తూ ఉండిపోయింది.

'అటు చూడండి,' అంటూ కాళి వ్రేలెత్తి చిత్రగృహం వైపు చూపించింది. మిగిలిన ఇద్దరూ అటు తమ చూపులు పోనిచ్చారు.

మసక వెన్నెలలో చిత్రగృహం అసలే చిన్నదిగా కనిపిస్తోంది. దాని కప్పుమీద ఒకరిద్దరు వ్యక్తులు నిలబడి ఉండడం అస్పష్టంగా కనిపించిందందరికీ. ఆకారాలు స్పష్టంగా కనిపించడం లేదు.

'ఎవరు వాళ్ళు?' అంది నర్మద.

'అదే తెలియడం లేదు. ఈ మధ్య మనవాళ్లు చిత్రగృహం ఉపయోగించడం లేదు కూడా. కేవలం ఇప్పుడు యమదూతను బంధించడం మాత్రమే జరిగింది,' కాళి అంది.

ఆ ఆకారాలు క్రమంగా కదులుతూ ఉండడం ముగ్గురూ గమనించారు. కాని అక్కడ వాళ్లేం చేస్తున్నదీ స్పష్టంగా తెలియడం లేదు.

'మనం క్రిందకి వెళ్ళి మంత్రవాదికీ సంగతి చెబుదాం,' అంది నర్మద.

మరుక్షణంలో ముగ్గురూ తమ సంభాషణలను కట్టిపెట్టి భవనం మీది నించి హడావిడిగా క్రిందికి దిగి వెళ్ళిపోయారు.

అప్పటికి కొంచెం ప్రొద్దుపోయింది. చంద్రుడు మేఘాల చాటున దాక్కొన బోతున్నాడు.

యక

# 7

గంభీరమైన నిశ్శబ్దం అన్నిప్రక్కలా వ్యాపించి ఉంది. మసక వెన్నెలలో ప్రపంచమంతా కన్ను మూసినట్టుగా ఉంది. సాధారణంగా ఎవరూ చొరబడని ఆ ప్రదేశం కొత్తవారికి భయంకరంగానే కనిపిస్తుంది. అప్పుడప్పుడూ వినిపించే ఏవో విచిత్రధ్వనులు ఆ భయాన్ని పెంపొందిస్తాయి.

చిత్రగృహం మిగిలిన భవనాలంత ఎత్తుగా లేకపోయినా నేలమీద నిలబడి చూస్తే అంత మరీ నేలమీదకి ఉన్నట్టు కూడా అనిపించదు. దానిమీదకి ఎక్కాలంటే కొంచెం శ్రమపడాల్సిందే.

ఆ చిత్రగృహం వెనుకప్రక్క కప్పుమీద ఇద్దరు వ్యక్తులు నిలబడి ఉన్నారు. వాళ్లక్కడ ఏం చేస్తున్నదీ స్పష్టంగా కనిపించడంలేదు కాని వాళ్లు నిలబడి ఉన్నచోట కప్పు ఛేదించబడి ఉంది.

కాసేపటికి అందులో ఒకతనన్నాడు.

'మనవెవరూ చూడడం లేదుకదా?'

రెండవ వ్యక్తి సమాధానమిచ్చాడు.

'అసలు ఈ చుట్టుపక్కల ఎవరూ ఉండడంలేదు. దూరంగా ఉన్న ప్రధాన భవనంలోను, దాని చుట్టుప్రక్కల ఉన్న భవనాలలోను కొందరు ఉంటున్నా వాళ్లకు మనం కనిపించం. చిత్రగృహం చుట్టూ ఉన్న భవనాలు చిత్రగృహం కన్నా ఎత్తయినవి కావడంచేత అంత దూరంనించి ఎవరూ

'జయ చూడలేరు.'

ఉంటుంది.

మొదటి వ్యక్తి సందేహంగా మళ్ళీ అన్నాడు.

'అక్కడినించి కూడా భవనంమీద నిలబడిన వాళ్ళు మనల్ని చూడవచ్చుననుకుంటాను.'

'కాని ఈ సమయంలో భవనంమీదికి ఎవరు వెళ్తారు. పైగా ఇక్కడ ఉంటున్న విక్రమ్ శారీరక బలంతప్ప మానసిక బలం కలవాడుకాదు. అందుచేత మనం అంతగా భయపడాల్సిన అవసరం లేదు,' రెండవ వ్యక్తి అన్నాడు.

మళ్ళీ కాసేపటివరకు ఆ ఇద్దరిలో ఎవరూ మాట్లాడలేదు. ఇద్దరి మొఖాలమీదా ముసుగులున్నాయి. ఆ ఇద్దరూ తమ పనిలో నిమగ్నమై పోయారు.

కాసేపటికి మరో ఆకారంకూడా వాళ్ల దగ్గరకువచ్చి చేరింది. చూడడానికి స్త్రీలా ఉంది. కాని ఆమె ముఖంమీద కూడా గుర్తు పట్టడానికి వీలులేకుండా ముసుగు ఉంది.

'మనం జాగ్రత్తగా క్రిందకి దిగాలి. ఏమాత్రం చప్పుడు కాకూడదు,' రెండవ ముసుగు వ్యక్తి అన్నాడు.

'ఎవరైనా మన సంభాషణను వినరుకదా?' మూడవ వ్యక్తి అంది.

'మొత్తానికి అబలవనిపిస్తున్నావ్. ఈమాత్రానికే భయపడి పోతున్నావా? మన సంభాషణలు వినడానికి ఎవరూ ఇక్కడికివచ్చి కూర్చోలేదులే. కంగారు పడకు,' మళ్ళీ రెండవ వ్యక్తి అన్నాడు.

ఆమె సిగ్గుపడినట్టుంది. ఇంకేమీ మాట్లాడలేదు. ముగ్గురు చిత్రగృహంమీదినించి క్రిందకి దిగే ప్రయత్నంలో ఉన్నారు.

'చీకటిగా ఉంటే ఇంకా బాగుంటేది. మనం ఎవరికీ కని పించనుకూడా కనిపించకుండా ఉండేవాళ్లం,' మొదటి వ్యక్తి అన్నాడు.

'ఈమాత్రం వెన్నెల చీకటిలోనే జమలే. ఇప్పుడు మాత్రం మననెవరు చూస్తారు!' అన్నాడు రెండవ వ్యక్తి.

ముగ్గురూ చిత్రగృహంమీదినించి క్రిందికి దిగారు. ఒక సారి నాలుగువైపులకూ తమ చూపుల్ని పోనిచ్చారు.

'రాయదుర్గం కోటలోకి చాలాసార్లు వచ్చాను కాని చిత్రగృహాన్నెన్నడూ చూడలేదు. చనిపోయిన రాయదుర్గాధిపతి నాకు పరమమిత్రుడు. పాపం నరేంద్రమహారాజు చేతిలో ప్రాణాలర్పించవలసి వచ్చింది. ఆ సమయంలో సహాయం చేద్దామనుకున్నా కాని ఆ అవకాశం నాకు లభించలేదు,' మొదటివ్యక్తి అన్నాడు నెమ్మది నెమ్మదిగా ఊపిరి పీలుస్తూ.

'అప్పుడాయనకు సాయం చెయ్యలేక పోయినా ఇప్పుడు మాకు చేస్తున్నారుగా చాలు. ఆయన శత్రువులపై పగ సాధించడంద్వారా ఆయన ఆత్మకుకూడా శాంతి చేకూర్చిన వారవుతారు,' ఆ స్త్రీ అంది మందస్వరంలో.

'రాయదుర్గంలోకి వచ్చినప్పుడు మీకాయన ఎన్నడూ చిత్రగృహం చూపించలేదూ?' రెండవ వ్యక్తి ప్రశ్నించాడు.

'లేదు. నేనుకూడా ఎప్పుడూ అడగలేదు. చిత్రగృహాన్ని గూర్చి విన్నాను కాని దానిని చూడాలన్న అభిలాష అంతగా లేకపోయింది,' మొదటి వ్యక్తి సమాధానంగా

'పోనీ ఇప్పుడు చూశారుగా,' మూడవ మనిషి అంది.

'చూసిన భాగమంతా చీకటిగానే ఉంది. ఏం చూసినట్టు! స్పష్టంగా నాకేమీ కనిపించలేదు,' అన్నాడు మొదటి వ్యక్తి.

'ఔను. ఈమధ్య చిత్రగృహాన్ని ఎవరూ ఉపయోగించక పోవడంవల్ల అదలా ఉంది. దీపం వెలిగించే దిక్కు కూడా ఉన్నట్టు లేదు. పైగా మీరు చూసింది చిత్రగృహంలో ఎన్నోవంతో! ఇంకా చూడవలసింది చాలా ఉంది. ఖైదు గదులవైపు అసలు మనం వెళ్ళనేలేదు,' అన్నాడు రెండవ వ్యక్తి.

మాట్లాడుకుంటూ ముగ్గురూ చిత్రగృహం ప్రక్కనే ఉన్న ఒక చిన్న ఇంటివైపు వెళ్లారు. రెండవవ్యక్తి ముందు నడుస్తుండగా మిగిలిన ఇద్దరూ అతని ననుసరించారు.

'ఈ ఇంటిలోకే మనం ప్రవేశించాలి,' అన్నాడు ముందు నడుస్తున్న వ్యక్తి.

మిగిలిన ఇద్దరూ ఆ ఇంటివంకే పరీక్షగా చూశారు. అది చాలా చిన్న ఇల్లు. ఎత్తుగాకూడా లేదు. చుట్టూ ఉన్న భవనాలకన్నా చాలా తక్కువ ఎత్తులో ఉంది. బయటినించి చూస్తే లోపల ఒక గదికంటే ఎక్కువ ఉన్నట్టుగా లేదు.

'మనం దీనిలోకి ప్రవేశించాలన్నమాట,' మొదటి వ్యక్తి సందేహంగా అన్నాడు.

'ఔను. ఈ ఇంటిసంగతి నాకు తప్ప ఎవరికీ తెలియదు చెప్పాలి. వెనకటి రాయదుర్గాధిపతికి తెలుసు. కాని ఆ చనిపోయాడుగా,' రెండవ వ్యక్తి అన్నాడు.

'నరేంద్రమహారాజు గూఢచారులికి దీని అంతు చిక్క లేదన్నమాట,' మూడవ మనిషి అంది.

'వాళ్లకు దీనిని కనుక్కోవాల్సిన అవసరం రాలేదు. సాధారణంగా బయటినించి చూసిన వాళ్లెవరూ దీనిలో పెద్ద విశేషముంటుందని అనుకోరు. అందుచేత దీని జోలికి వెళ్లరు.' అన్నాడు రెండవ ముసుగుమనిషి.

ఆ ఇంటిని సమీపించగానే తలుపులవంక పరీక్షగా చూసి మూడవ వ్యక్తి అంది.

'తాళంవేసి ఉన్నట్టుంది.'

'దానిని తెరిచే ఉపాయం నాకు తెలుసు.' అన్నాడు రెండవ వ్యక్తి.

తన దగ్గర ఉన్న ఏదో వస్తువు సాయంతో సునాయాసంగా ఆ తాళాన్ని పగలగొట్టి ఆ వ్యక్తి అన్నాడు.

'ఇదేదో మామూలు గృహమని దీనికి గట్టితాళం వెయ్యలేదు.'

తలుపులు తెరచుకుని ముగ్గురూ లోపలికి ప్రవేశించారు. లోపలి ప్రక్కనించి రెండవ వ్యక్తి వెంటనే ఆ తలుపులు మళ్ళీ మూసివేశాడు. గడియ వెయ్యడానికిగాని తాళం వెయ్యడానికిగాని లోపల తగువసతులు లేవు. అందుచేత తలుపులు మామూలుగానే మూసి ఉంచాల్సి వచ్చింది.

లోపల ఒక్క గదికంటే ఎక్కువ లేవు. ఆ గదికికూడా
ని, గాలి వెలుతురు వచ్చే ఇతరమార్గాలుగాని లేవు,
తలుపుల సందులగుండా ఏమాత్రమైనా గాలి,
అంతే.

రెండవ వ్యక్తి తన ముఖంమీద ఉన్న ముసుగును తొల గించి ఎక్కడినించో కొవ్వొత్తి నొకదానిని తీసి వెలిగించాడు. గాఢాంధకారం క్రమ్ముకున్న ఆ గదిలో వెలుగు ప్రవేశించ గానే అందరి కళ్లూ మిరుమిట్లు గొల్పినంత పనయింది.

ఆ వ్యక్తితోపాటు మిగిలిన ఇద్దరూకూడా తమ ముఖాల మీద ముసుగులు తొలగించారు. ఇంకెవరూ తమరు చూడరన్న ధైర్యం వాళ్లకు కలిగింది.

ముగ్గురూ గది మధ్యగా ఒకచోట కూర్చున్నారు. రెండవ వ్యక్తి ఆ గది నాలుగుమూలలా పరీక్షగా చూడనారంభిం చాడు. మిగిలిన ఇద్దరూ అతనిమీద తమ చూపులు నిలిపారు.

ఆ ముగ్గురు వ్యక్తులూ ఎవరోకాదు. మొదటివ్యక్తి జయ సింహుడు. రెండవవ్యక్తి మంత్రి సాధు. మూడవవ్యక్తి మహా మాయ.

'ఎక్కడ ఉంది దారి?' మహామాయ ప్రశ్నించింది కుతూ హలంకొద్దీ సాధును.

'అదే నేనూ చూస్తున్నాను. ఇక్కడినించి దారి ఉందన్న విషయం నాకు తెలుసు కాని ఎక్కడ ఉందో నాకు తెలి యదు. నేను ఇంతకుముందు కళ్లారా చూడలేదుగా వెంటనే చెప్పడానికి. అయినా కాస్త పరిశీలించి చూస్తే మార్గం దొరకక్కపోదులే,' సాధు అన్నాడు నెమ్మదిగా. అతనిచూ నాలుగువైపులా తిరుగుతూనే ఉంది.

'మీరు మీ సైన్యాన్ని నదీతీరానికి వచ్చి నే చోట ఉండమని ఆజ్ఞాపించి వచ్చారుకదూ సింహుడివైపు తనచూపు మరల్చి ప్రశ్ని

'అలాగే చెప్పి వచ్చాను. వాళ్లీపాటికి అక్కడికి చేరు కుని ఉంటారు కూడా. మనదే ఆలస్యం. మనం అక్కడికి ఎంత త్వరగా చేరుకుంటే అంత మంచిది,' జయసింహుడు సమాధానంగా అన్నాడు.

'ఇక్కడ విక్రమ్ చేతిలో ఎంత సైన్యం ఉందో మీకు తెలుసునా?' మహామాయ మంత్రివంక చూసి అడిగింది.

'నాకు సరిగా తెలియదు. ఎక్కువ భాగాన్ని నరేంద్ర మహారాజు తన కోటకు పంపి వేసినట్టుగా విన్నాను. ఇక్కడ చాలా తక్కువ సైన్యమే ఉంటుంది. తమకు ఎదురు తిరిగే వాళ్లు ఎవరూ లేరనే ధైర్యంతో వీళ్ళిక్కడ ప్రమత్తులై ఉన్నారు కూడా,' అన్నాడు మంత్రి సాధు.

'త్వరగా మన సైన్యం కోటలోకి ప్రవేశించగలిగితే వాళ్ల చేతుల్లో ఎంత సైన్యం ఉంటే మాత్రం మనకు లెక్కేమిటి! నేనే స్వయంగా విక్రమ్‌ను ఎదుర్కొటాను. నా కత్తికి తిరుగు లేదని మీకు తెలుసుగా,' తన భుజబలానికి తానే గర్విస్తూ జయసింహుడన్నాడు.

'అందుకనే వెదుక్కుంటూ మేం మీ దగ్గరికి వచ్చాం. మీకంటే బలవంతులెవరూ ఎంత వెదకిచూసినా మాకు కని పించలేదు. సర్వత్రా జయాన్ని సాధించగల సింహమే మీరు,' అన్నది జయసింహుణ్ణి ప్రశంసిస్తున్నట్టుగా మహా మాయ.

మంత్రి సాధు ఓసారి జయసింహుడివంక చూసి అన్నాడు.

దుర్గం ప్రకృతి బలం కలిగినకోట అని అందరికీ ధైర్యం.

వెళ్లి ఎంతటి బలవంతులైనా ఆక్రమించుకో

గలగడం సులభసాధ్యం కాదన్నది అందరికీ తెలిసిన విష యమే. కాని అందులోనూ డొంక తిరుగుళ్లున్నాయి. ఈ మొండిధైర్యంతోనే కాళ్లు చేతులు ముడుచుకు కూర్చున్న రాయదుర్గాధిపతికి నరేంద్రమహారాజు గాఢవారులు తగిన పాఠం నేర్పారు. అయితే ఏం లాభం! ఇప్పుడు విక్రమ్‌కూడా అదే ధైర్యంతో కాళ్లార జాపుకుకూర్చున్నాడు. ఒక్క రోజుతో జయసింహుడి అసంఖ్యాక సైనికులు ఎవరికీ తెలియ కుండా ఎన్నడూ కనీ వినీ ఎరగని మార్గంద్వారా కోట మధ్యకువచ్చి చేరుకుంటారని అతను ఎలా తెలుసుకోగలడు!' అతనన్నాడు.

'అయితే రేపీపాటికి రాయదుర్గం మనదన్నమాటే,' మహా మాయ అంది ఆనందంగా.

'కాక జయసింహుని దండయాత్ర విఫలమౌతుందనేనా మీ ఉద్దేశం ?' జయసింహుడు ధీమాగా అన్నాడు.

మంత్రి ఆ ఇద్దరివంకా చూసి చిరునవ్వు నవ్వాడు. వాళ్లు కూడా ఆనందంగా అతనివంక చూశారు. అలా కాసేపు నిశ్శ బ్దంగా గడచిపోయింది.

'ఎందుకింకా ఆలస్యం,' ఉన్నట్టుండి మహామాయ అంది.

అకస్మాత్తుగా మంత్రి మొఖం వికసించింది. ఒక మూలగా గోడకు చిన్న పగులులాంటి దేదో అతనికి కనిపించింది. ఆ పగులు చతురస్రాకారంలో ఉందికాని అది అంత స్పష్టంగా కనిపించడం లేదు.

అతను ఆ పగులు వైపు పరీక్షించి చూడడం మిగిలిన ఇద్దరి చూపులూ ఆ వైపుకు తిరి-

మంత్రి లేచి అక్కడికి వెళ్ళాడు. ఆ పగులుకు మధ్యగా ఉన్న రాతి ముక్కను బలంగా లోపలికి నెట్టడానికి శాయశక్తులా ప్రయత్నించసాగాడు. జయసింహుడు, మహామాయ అతను చేస్తున్న పనిని వింతగా చూస్తున్నారు.

ఆరాతి ముక్క చివరికి పెద్ద చప్పుడు చేస్తూ వెనక్కి వాలింది. అందరూ ఆశ్చర్యంగా ఆ వైపున తమ చూపుల్ని కేంద్రీకరించారు. మనిషి దూరడానికి తగినంతస్థలం అక్కడ ఏర్పడింది.

'ఇదే ఆ సొరంగం,' అన్నాడు మంత్రి.

'కాని ఇంత చిన్న సొరంగంగుండా అంత సైన్యం లోపలికెలా వస్తుంది?' అన్నాడు జయసింహుడు సందేహిస్తూ.

'ఫర్వాలేదు. ఒక్కరొక్కరుగా రావచ్చు. ఎవరికీ తెలియకుండా ఈ సొరంగంగుండానే మనం మొత్తం సైన్యాన్ని కోటలోపలికి తీసుకురావచ్చు. ఈ ప్రాంతాలకు అసలెవరూ రారుకూడా. మన సైన్యం లోపలికి ప్రవేశిస్తున్నదని తెలుసుకోవడం ఎవరికైనా కష్టం,' అన్నాడు మంత్రి సాధు.

ముగ్గురూ ఆ సొరంగంవైపు పరీక్షగా చూస్తున్న సమయంలో అకస్మాత్తుగా గది తలుపులు తెరచుకున్న చప్పుడైంది. ముగ్గురి చూపులూ కంగారుగా ఆ ప్రక్కకు తిరిగాయి.

## 3

నర్మద, కళ్యాణి, కాళి క్రిందికి దిగి వెళ్ళిపోగానే కాళి ర్నగా మంత్రవాది దగ్గిరికి వెళ్ళింది. అప్పటికి కొంచెం

ప్రొద్దుపోయింది. అప్పుడే మంత్రవాది, నేపాళి, విక్రమ్ వగైరాలు తమసమావేశం ముగించి తమ తమ గదులవైపు వెళ్ళున్నారు.

'ఇప్పటిదాకా మీరంతా భవనంమీదే కూర్చున్నారా?' మంత్రవాది తన దగ్గరికి వచ్చిన కాళిని అడిగాడు.

'ఔను. కబుర్లు చెప్పుకుంటూంటే కాలం తెలియకుండానే గడచిపోయింది కాని ఒక ముఖ్యమైన సంగతి మీతో చెప్పడానికి వచ్చాను,' కాళి అంది.

'ఏమిటది?' మంత్రవాది ఆతురతగా వెంటనే ప్రశ్నించాడు.

భవనంమీద కూర్చుని మాట్లాడుకుంటుండగా మాకో విచిత్రం కనిపించింది. చిత్రగృహం కప్పుమీద రెండు ఆకారాలు మాకు స్పష్టంగా అగుపించాయి. ఎవరో ఇద్దరు మనుషులు దానిమీదికెక్కారని మాకు అనుమానంగా ఉంది. ఆ సంగతి చెప్పడానికే మేం క్రిందికి దిగివచ్చాం,' అని సమాధానమిచ్చింది కాళి.

ఆమె చెప్పిందంతా ఆతురతగా విన్న మంత్రవాది ఒక్కక్షణం గంభీరంగా ఆలోచించాడు.

'సరే. నువ్వు వెళ్లు. ఆ సంగతి నేను చూస్తానులే,' అన్నాడు కాళితో.

కాళి వెళ్లిపోయింది. మంత్రవాది చూపు చిత్రగృహం వైపు మరలింది కాని భవనాల వెనుకనించి అది కనిపించడం లేదు. అతను వెంటనే విక్రమ్‌ను, నేపాళిని పిలిచాడు. సంతంతా వాళ్లకు చెప్పాడు.

'ఎవరైనా శత్రువులై ఉండవచ్చు. మనం వెంటనే వెళ్లి చూడాలి,' అన్నాడు నేపాళి.

'అదే నేనూ అంటున్నాను. కాని ఆ పనినే కొంచెం తెలివిగా చెయ్యాలి. అసలు చిత్రగృహం మీదికి వాళ్లు రావడానికిగల కారణమేమిటో కూడా మనం తెలుసుకుంటే మంచిది,' అన్నాడు మంత్రవాది.

'అదెలా సాధ్యపడుతుందో ఆలోచించి చెప్పండి. అలాగే చేద్దాం,' అన్నాడు విక్రమ్.

'ముందు నేనూ నేపాళి అక్కడికి వెళ్తాం. వాళ్లకు కనిపించకుండా ఒకచోట దాగి వాళ్ల సంభాషణలు వినడానికి ప్రయత్నిస్తాం. వాటినిబట్టి వాళ్లక్కడికి ఎందుకు వెళ్లిందీ మనకు అర్థంకావచ్చు. ఇంతలో మీరు కొందరు సైనికుల్ని వెంటపెట్టుకువచ్చి ఏ భవనంచాటునో దాగి ఉండండి. నేను పిలవగానే మీరువచ్చి వాళ్లను బంధించవచ్చు,' మంత్రవాది తన ఉద్దేశాన్ని తెలియచేశాడు.

'అలాగే,' అంటూ విక్రమ్ తన పనిమీద వెళ్లిపోయాడు.

మంత్రవాది, నేపాళి చిత్రగృహం వైపు బయలుదేరారు. మసక వెన్నెలలో ఏమీ అంత స్పష్టంగా కనిపించడంలేదు. ప్రతివస్తువూ అస్పష్టంగానూ లేదు. ఎత్తుగా ఉన్నభవనాల నీడల్లో నడుస్తూ ఎవరికీ కనిపించకుండా ఆ ఇద్దరూ చిత్రగృహం దగ్గరగా వెళ్లారు.

ఒక భవనం చాటుగా నిలబడి చిత్రగృహం మీదికి తమ చెవులు పోనిచ్చారు వాళ్లిద్దరూ. కాళి చెప్పిన రెండు

ఆకారాలకు బదులుగా మూడు ఆకారాలు ఇప్పుడు వాళ్లకు కనిపించాయి.

ముగ్గురి ముఖాలమీదా ముసుగులు ఉండడంవల్ల గుర్తు పట్టడం అసంభవంగా ఉంది. అయినా వాళ్లెవరో గ్రహించ డానికి మంత్రవాది ప్రయత్నించక పోలేదు. వాళ్ళు ఫలానా అయి ఉంటారని వాళ్ళు ఊహించుకున్నా ఆ విషయాన్ని రూఢి పరచుకునేదెలా?

'ఎవరై ఉంటారు?' నేపాళి నెమ్మదిగా అడిగాడు.

'అదే ఆలోచిస్తున్నాను. ముఖాలు తెలియకపోయినా ఆకారాల్ని బట్టి ఇద్దరిని ఊహించడానికి ప్రయత్నిస్తున్నాను. ఆ స్త్రీ మహామాయ అయి ఉంటుందనుకుంటున్నా. మిగిలిన ఇద్దరిలో ఒకతను సాధు అయి ఉండాలి. అయితే మూడవ వ్యక్తి ఎవరో ఎంతమాత్రం ఊహించడానికి వీలులేకుండా ఉంది" అన్నాడు మంత్రవాది సమాధానంగా.

'వాళ్ళు ముగ్గురూ చిత్రగృహం మీదినించి క్రిందకి దిగు తున్నారు. బహుశా ఇటే వస్తారేమో,' అన్నాడు నేపాళి.

'రానీ. ఇటువస్తుంటే మనం తప్పుకుందాంలే,' అన్నాడు మంత్రవాది.

వాళ్ళు మాట్లాడుకుంటున్న ధ్వని ఈ ఇద్దరికీ అస్పష్టంగా వినిపించసాగింది. ఇద్దరూ చెవులు నిక్కించి జాగ్రత్తగా విన డానికి ప్రయత్నించ నారంభించారు. కాని వాళ్ళు మాట్లా డుకుంటున్నదేమిటో ఇంకా అంత స్పష్టంగా తెలియ లేదు.

ఆ ముగ్గురూ చిత్రగృహం ప్రక్కనే ఉన్న చిన్న ఇంట్లో ప్రవేశించడం, లోపలికి వెళ్ళింతర్వాత దాని తలుపులు మయ్యడం ఇద్దరు గూఢచారులూ గమనించారు.

'ఆ ఇంటిలో ఏముందో?' అన్నాడు నేపాళి.

'అక్కడేముందో మనకేం తెలుసు? మనంకూడా అక్కడికి వెళ్ళి తలుపులదగ్గర నిలబడదాం రా,' అన్నాడు మంత్రవాది.

ఇద్దరూ ఆ ఇంటి తలుపులదగ్గరికి వెళ్ళి నిలబడ్డారు. లోపలి వాళ్ల సంభాషణ అక్కడికి స్పష్టంగా వినిపిస్తోంది. ఇద్దరూ మౌనంగా వింటూ నిల్చబడ్డారు.

వాళ్ల సంభాషణలను బట్టి ఆ మూడవ వ్యక్తి జయసింహుడని వీళ్ళు గ్రహించారు. వాళ్ళిక్కడి కెందుకు వచ్చింది, వాళ్ల ప్రయత్నమేమిటో కూడా గూఢచారులిద్దరికీ బోధపడింది. ఆ ఇంటి రహస్యం కూడా గ్రహించారు. జయసింహుడు మిగిలిన ఇద్దరి సాయంతో రాయదుర్గంమీద దండయాత్ర చెయ్యడానికి తలపడ్డాడని తెలియగానే ఇద్దరికీ ఎంతో ఆశ్చర్యం కలిగింది.

అకస్మాత్తుగా లోపలినించి సంభాషణలు వినిపించడం ఆగిపోయింది. నేపాళి మరింత ఆశ్చర్యంగా మంత్రవాదివంక చూసి చాలా నెమ్మదిగా అన్నాడు.

'వాళ్లిక్కడినించి పారంగంగుండా వెళ్తున్నారేమో! మనం ఇక్కడే నిలబడి ఉంటే ప్రయోజనమేమిటి?'

మంత్రవాది గంభీరంగా చిరునవ్వు నవ్వాడు.

'కొందరపడకు. వీళ్ళెక్కడికీ పోరులే. సొరంగంలో ...చినా మనం వీళ్లని వదలం. అందుకు తగిన పన్నాగం

నా మెదడులో ఉంది. ఇంకా ఇక్కడ కాసేపాగి చూద్దాం,' అన్నాడతను.

'చూస్తే ఈ తలుపులుకూడా దగ్గరకు వేసి ఉన్నట్టున్నాయి. మనం లోపలికి ప్రవేశించవచ్చుగా. వాళ్లక్కడ ఉండి ఉండరు,' ఆతురతకొద్దీ అన్నాడు నేపాళి.

'తొందరపడవద్దని చెప్పాను,' అంటూ నేపాళిని మళ్ళీ హెచ్చరించాడు మంత్రవాది.

ఇద్దరూ మౌనంగా అక్కడే నిలబడ్డారు కాసేపు. లోపలి నించి ఎటువంటి చప్పుడూ వినిపించడంలేదు. కొంచెం దూరంలో ఒక భవనంచాటున మంత్రవాది చెప్పిన ప్రకారం విక్రమ్ కొద్దిమంది సైనికులతో నిలబడి ఉండడం ఇద్దరూ చూశారు.

అకస్మాత్తుగా నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ఏదో పెద్ద చప్పుడు ఇంట్లోంచి వాళ్లకి వినిపించింది. ఆ చప్పుడేమిటో అర్థంకాక ఇద్దరూ ఒకరి మొఖాలొకరు చూసుకున్నారు.

తర్వాత నేపాళి దృష్టి చిత్రగృహంవైపు మరలింది. అతను ఆశ్చర్యంగా వెంటనే అన్నాడు.

'ఎవరో ఇటే వస్తున్నారు. అటు చూడు'

మంత్రవాది కూడా ఆ ప్రక్కకు చూశాడు. బాగా వృద్ధంగా ఉన్న ఒక వ్యక్తి తమవైపుకు రావడం అతను గమనించాడు.

'మనం ప్రక్కకు తప్పుకుందాం. అతనుకూడా ఆ ఇంటిలో ప్రవేశించడానికి వస్తున్నట్టున్నాడు. లోపలి వాళ్ళ సంబంధించినవాడే అయి ఉండాలి,' అన్నాడు నెమ్మదిగా

ఇంతలో లోపలినించి వాళ్ళు మాట్లాడుకుంటున్న ధ్వని కూడా వినిపించసాగింది. కాని మంత్రవాది, నేపాళీ అక్కడి నించి తప్పుకోక తప్పలేదు. ఇద్దరూ తక్షణం అక్కడినించి గోడ చాటుకు వెళ్లారు.

ఆ వ్యక్తి తిన్నగావచ్చి ఆ ఇంటి తలుపులు నెట్టి లోపలికి ప్రవేశించాడు. తిరిగి తలుపులు మూసుకున్నాయి.

మంత్రవాది, నేపాళీ ఆ వ్యక్తివంక పరీక్షగా చూశారు. అతని ముఖంమీద ముసుగులేదు. అయినా అతను తెలిసిన వ్యక్తిలా కనిపించలేదు. ఇంతవరకు ఆ వ్యక్తిని ఎక్కడా చూసినట్టు గుర్తులేదు. తెలిసినవ్యక్తే ఎవరైనా మారువేషంలో ఉంటే ఉండవచ్చు. కాని గుర్తు పట్టడానికి శక్యం కాకుండా ఉంది.

మంత్రవాది నెమ్మదిగా నేపాళీతో అన్నాడు.

'నువ్వు మళ్లీ తలుపులదగ్గరికి వెళ్లి వాళ్లు మాట్లాడుకుంటున్న విషయాలు విను. నేను విక్రమ్ దగ్గరికివెళ్ళి మాట్లాడి వస్తాను.'

నేపాళీ మౌనంగా తల ఊపి మళ్ళీ ఆ తలుపుల దగ్గరికి జరిగాడు. మంత్రవాది విక్రమ్ సైనికులతోపాటు నిలబడి ఉన్న భవనం దగ్గరికి వెళ్ళాడు.

విక్రమ్ మంత్రవాదిని చూడగానే 'ఎవరు వాళ్ళు? ఎందుకు వచ్చినట్టు?' అని ప్రశ్నించాడు ఆతురతగా.

మంత్రవాది తాము తెలుసుకున్న అన్ని విషయాలూ విక్రమ్‌కు వివరించి చెప్పి చివరికిలా అన్నాడు.

'జయసింహుడి సైన్యం నదీతీరాన ఎక్కడో ఉండి ఉంటుంది. వాళ్ళు మనల్ని మోసగించి మనకు తెలియకుండా

కోటలో తిష్ఠ వెయ్యడానికి ప్రయత్నిస్తున్నారు. మీరు ఒక పని చెయ్యండి. వెంటనే కోటలో ఉన్న సైన్యాన్నంతా తీసుకుని నదీతీరాన దండువిడిసి ఉన్న జయసింహుడి సైన్యాన్ని ఎదుర్కోండి. రాత్రిపూట ప్రమత్తులై ఉన్న వాళ్లను తలవని తలంపుగా ఎదుర్కొని జయించడం సులభం. మేం ఇక్కడ ఉన్న ఈ సైనికుల సాయంతో అక్కడ సమావేశమై ఉన్న శత్రువుల్ని బంధిస్తాం.'

విక్రమ్ మంత్రవాది చెప్పిన ప్రకారం చెయ్యడానికి తనతో పాటు వచ్చిన సైనికుల్ని అక్కడే వదలి కోటవైపు వెళ్ళాడు. మంత్రవాది అక్కడ నిలబడి ఉన్న సైనికులవంక చూసి ఆజ్ఞాపించాడు.

'మీరందరూ ఇక్కడే ఉండండి. నేను మళ్లీ అక్కడికి వెళ్ళి సంగతి సందర్భాలు చూసి అవసరమైనప్పుడు పిలుస్తాను. నేను చప్పట్లు కొట్టగానే మీరందరూ వచ్చేయండి.'

మరుక్షణంలో మంత్రవాది నేపాళి నిలబడి ఉన్న చోటికి వెళ్లాడు. నేపాళి చిరునవ్వు నవ్వుతూ మాట్లాడకుండా లోపలి వాళ్ల సంభాషణలు వినమని మంత్రవాదికి సంజ్ఞ చేశాడు. తర్వాత తన ప్రక్కనే నిలబడిన మంత్రవాది చెవిలో కాసేపు గుసగుసలాడాడు. మంత్రవాది మొఖంమీద కూడా చిరు నవ్వు మొలకెత్తింది. నేపాళివంక వింతగా చూసి అతను కూడా లోపలి వాళ్ల సంభాషణలను చెవులొగ్గి విననారంభించాడు.

కాసేపటికి లోపలినించి ఎవరో బయటికి వస్తున్న చప్పుడు వినిపించింది. ఇద్దరూ మళ్లీ గోడచాటుకు తప్పుకున్నారు.

# 9

తలుపులు మళ్లీ మూసి తమ దగ్గరికి అడుగులో అడుగు వేసు కుంటూ నడచి వస్తున్న ఆ దృఢమైన వ్యక్తిని చూసి మహా మాయ, మంత్రి, జయసింహుడు ఆశ్చర్య పడసాగారు. ఎంత ప్రయత్నించినా ఆ వ్యక్తి ఎవరో తెలుసుకోవడం సాధ్యం కాకుండా ఉంది.

ముగ్గురిలో ఎవరూ మాట్లాడలేదు. ఆ వ్యక్తినిగురించి తలో మాదిరిగా తమ మనస్సుల్లో ఊహించుకోసాగారు. నరేంద్ర మహారాజుకు సంబంధించిన వ్యక్తి అయి ఉండాలని మొత్తా నికి ముగ్గురూ అనుకున్నారు.

ఆ వ్యక్తి ఎవరో ఒకరికి తెలిసి ఉంటుందని మరొకరు భావించి ఒకరి మొఖాలొకరు చూసుకోసాగారు. వాళ్లలా చూస్తూ శిలా స్థంభాల్లా నిలబడిపోవడం గమనించిన ఆ వ్యక్తి బిగ్గరగా అట్టహాసం చేశాడు. వాళ్లకు మరింత దగ్గరగా అడుగు వేశాడు.

'ఏం చేస్తున్నారు మీరిక్కడ?' అతను గంభీరంగా ప్రశ్నించాడు.

అతని కంఠస్వరం చాలా కటువుగా ఉంది. ఆ ప్రశ్న విన్నా కాసేపటివరకు ఆ ముగ్గురూ ఏమీ మాట్లాడలేదు. ఏమని సమాధానమివ్వాలో వాళ్లకు తోచలేదేమోకూడా.

అతను మళ్ళీ అడిగాడు.

'ఆ రాయిని వెనక్కి నెట్టిందెవరు?'

ఈసారి మంత్రి నెమ్మదిగా సమాధానమిచ్చాడు.

'నేనే.'

'ఎందుకు?' అతను మళ్ళీ అడిగాడు.

ఈ ప్రశ్నకు మళ్ళీ ఏమని సమాధానమివ్వాలో మంత్రికి తోచలేదు. తిరిగి మౌనం వహించాడు.

'చెప్పవేం?' ఆ వ్యక్తి గర్జించాడు.

మంత్రి మళ్ళీ జవాబిచ్చాడు.

'ఇక్కడినించి బయటికి వెళ్ళిపోవడానికి.'

ఆ వ్యక్తి ఓసారి వికటాట్టహాసం చేశాడు,

'అబద్ధాలాడుతున్నావ్. మీరు ముగ్గురూ ఇక్కడికి ఎందుకు వచ్చిందీ నాకు తెలుసు. ఎక్కడినించి వచ్చిందీ తెలుసు. నా దగ్గర అబద్ధాలాడి ఏం ప్రయోజనం లేదు,' అన్నాడు.

'అసలు మీరెవరో తెలుసుకోవాలని ఉంది,' మంత్రి కొంచెం ధైర్యంగా అన్నాడు.

'నేనెవరో తెలుసుకోవాల్సిన అవసరం నీకేమీ లేదు,' అతను సమాధానమిచ్చాడు.

'అయితే మీరిక్కడికెందుకువచ్చారు?' మంత్రి మళ్ళీ అడిగాడు.

'మీ రిక్కడ రహస్యంగా చేస్తున్న పనిని అరికట్టడానికి.'

దానివల్ల మీకు ప్రయోజనం?'

'ఆ సంగతి నీకనవసరం.'

'మరెవరికి అవసరం! ఇక్కడికి వచ్చి మేం చేస్తున్న పనికి అడ్డుతగలడానికి మీకేమీ అధికారంలేదు.'

ఆ వ్యక్తి మళ్ళీ అట్టహాసం చేశాడు.

దొంగపనులు చేసే అధికారం మీకుందన్నమాట. ఇలా మారుమూలమార్గాలు వెదికేకంటే ధైర్యం ఉంటే ఎదురుగా వచ్చి రాయదుర్గాన్ని స్వాధీనం చేసుకో వచ్చుగా.'

జయసింహుడికీమాట కొంచెం బాధ కలిగించిందనే చెప్ప వచ్చు. అతను తీవ్రంగా ఆ వ్యక్తికేసి చూశాడు. ఆ వ్యక్తి కూడా జయసింహుడి కేసి చూసి చిరునవ్వు నవ్వాడు.

'మీరిద్దరూ ఎలాగో పిరికిపందలూ, దుర్మార్గులు, మోస గాళ్లని నాకు తెలుసు. కాని జయసింహుడుకూడా మీతో కలవడం నాకు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.'

జయసింహుడు గుమ్మడికాయల దొంగలా భుజాలు తడు ముకున్నాడు. తన పేరావ్యక్తి కెలా తెలిసిందోనని ఆశ్చర్య పోయాడు.

'జయసింహుడు పరాక్రమవంతుడని విన్నాను. కాని ఇలాంటి నీచుల మాటలువిని వాళ్లకు సహాయం చేస్తాడని అనుకో లేదు,' ఆ వ్యక్తి మళ్లీ అన్నాడు.

ఈ మాట మంత్రికి, మహామాయకు కోపాన్ని కలిగిం చాయి. కాని ఏం చెయ్యాలో వాళ్లకు తోచడంలేదు. చివ రికి మంత్రి అన్నాడు.

'మేంచేసిన దుర్మార్గపు పనులేమిటో చెప్పగలరా? మితి మీరి మాట్లాడడం ఎప్పుడూ మంచిది కాదు.'

ఆ వ్యక్తి జయసింహుడితో అన్నట్టుగా అన్నాడు. 'ఇక్కడున్న ఈ స్త్రీ రఘువీర్ మహారాజు పట్టమహిషి అని నువ్వు పొరపడి ఉంటావు. కాని ఈమె అసలు పట్టమహిషి

కాదనీ, అసలు రాణి కళ్యాణి ఇప్పుడీ కోటలోనే ఉందని తెలుసుకుంటే నువ్వు ఆశ్చర్యపోతావు.'

ఈ మాటలు జయసింహుడికి ఆశ్చర్యాన్ని, మంత్రికి మహా మాయకు కంగారును కలిగించాయి. జయసింహుడు మిగిలిన ఇద్దరివంకా వింతగా చూశాడు.

'ఈ వ్యక్తి తానెవరో చెప్పకుండా అన్నీ అబద్ధాలు చెబుతున్నాడు. చూస్తే మాయమాటలు చెప్పి మిమ్మల్ని మానుండి విడదీయడానికి ప్రయత్నిస్తున్నట్టుంది.'

ఆ వ్యక్తి మళ్ళీ నవ్వాడు.

'జయసింహుడు కొంచెం తెలివి తేటలుపయోగించి తెలుసుకుంటే ఎవరు అబద్ధాలాడుతున్నదీ తెలుస్తుంది,' అతనన్నాడు.

జయసింహుడు ఆశ్చర్యంగా గదిలో ఉన్న ముగ్గురికేసీ చూడసాగాడు. చివరికి ఆ వ్యక్తి నడిగాడు.

'ఈమె మహారాణి కాదని మీరు నిరూపించగలరా?'

'నేను నిరూపించనక్కరలేదు. కొంచెం ప్రయత్నంచేస్తే మీరే నిరూపించుకోగలరు. లేదా రేపు రాయదుర్గంలోని ప్రధాన భవనంలో జరిగే ఒక సమావేశానికి హాజరుకండి. అన్ని సంగతులూ తెలుసుకోవచ్చు.' ఆ వ్యక్తి అన్నాడు.

మంత్రి సాధుకు ఆ వ్యక్తిమీద పట్టరానంత కోపం వచ్చింది. కళ్యాణిని తాము మార్చినట్టు ఈ వ్యక్తికి తెలుసునన్నమాట. ఈ విషయం తెలిసినవాళ్లు చాలా తక్కువమంది ఉన్నారు. అందులో ఈ వ్యక్తి ఎవరై ఉంటాడా అని మంత్రి ఆలోచించసాగాడు కాని. ఎంతకీ ఏమీ తట్టలేదు.

'ఈ వ్యక్తి ఎవరో పిచ్చివాడిలా కనిపిస్తున్నాడు. తగిన బుద్ధి చెబితే బాగుండుననుకుంటా. మీరితని మాటలు నమ్మకండి,' అన్నాడు మంత్రి జయసింహుడితో.

ఆ వ్యక్తి మంత్రికేసి కళ్ళెర్రజేసి చూశాడు.

'నన్ను శిక్షించగల సమర్థత నీకుందన్నమాట! నువ్వు చేసిన దుర్మార్గపు పనులు ఎవరికీ తెలియవని అనుకోకు. అన్నీ నాకు తెలుసు. తప్పుకుంటే నీ భండారమంతా బయట పెట్టగలను,' పరిహాసంగా అన్నాడతను.

మంత్రి కోపాన్ని ఆపుకోలేక కత్తిదూసి ఆ వ్యక్తిమీదికి దూకాడు. కాని అతను తొణకూ బెణకూ లేకుండా మంత్రి చేతిని గట్టిగా నొక్కి పట్టుకున్నాడు. అంతే. మంత్రి చేతి నరాలన్నీ బిగిసిపోయినట్టయింది. రక్తం స్తంభించిపోయింది. పట్టు తప్పి చేతిలోని కత్తి క్రిందకి జారిపోయింది. అంత బలవంతుడు కూడా తెల్ల మొఖం వేసి ఆ వ్యక్తి మొఖంవంక చూస్తూ నిశ్చేష్టుడై నిలబడిపోయాడు.

ఆ వ్యక్తి మళ్ళీ అట్టహాసంచేసి మంత్రిచెయ్యి వదలివేశాడు.

'నా శక్తిసామర్థ్యాల సంగతి నువ్వు గ్రహించలేదన్నమాట. కావాలంటే నిన్ను నామరూపాలు లేకుండా చెయ్యగలను. కాని ఎవరికీ హానిచెయ్యడం నా అభిమతం కాదు. మీరు మీ ప్రయత్నం మాని వెనక్కి వెళ్ళిపొండి,' అంటూ అతను జయసింహుడికేసి చూశాడు.

'నిజానికి నరేంద్రమహారాజు గాని, వాళ్ళ తాలూకు వ్యక్తులు గాని నీకెలాంటి అపకారమూ చేసి ఎరగరు. అలాంటప్పుడు

నువ్వు వాళ్లకు అపకారం చెయ్యబూనుకోవడం శ్రేయస్కరం కాదని హెచ్చరిస్తున్నాను: నీ మంచికే చెబుతున్నాను. వాళ్లతో సఖ్యం చెయ్యి. ఈ దుర్మార్గుల స్నేహం వదలి వెయ్యి. ఉప్పు తింటూ యజమానికే ద్రోహం తలపెట్టిన ఈ మంత్రి, ఒక సామాన్యుడి కూతురై ఉండీ రాజ్యాలేలడానికి నానా అగచాట్లూ పడుతున్న ఈ ఇందిర నువ్వు సాయం చేయతగినవాళ్లు కాదు. ఆలోచించుకో. నేను వెళ్ళిపోతున్నాను,' అన్నాడు కొంచెం నెమ్మదిగా.

అతని మాటలు మహామాయకు, మంత్రికి ఆశ్చర్యాన్ని కలిగించాయి. మహామాయ అసలు పేరుకూడా అతనికి తెలిసి ఉండడం ఆశ్చర్యం కాక మరేమిటి? మహామాయ అసలు పేరు ఇందిర అని తెలుసుకున్న జయసింహుడుకూడా ఆశ్చర్యంగా ఆమెవంక చూడసాగాడు.

వాళ్ల నా స్థితిలో వదలి ఆ వ్యక్తి వెనక్కి తిరిగాడు. నెమ్మదిగా తలుపులు తెరచుకుని బయటికి అడుగుపెట్టాడు. ఒకసారి అటూ ఇటూ చూసి తిన్నగా చిత్రగృహం వైపు నడక సాగించాడు.

గోడచాటుగా నిలబడి ఉన్న మంత్రవాది ఆ వ్యక్తి వెళ్ళిపోవడం చూసి నేపాళితో నెమ్మదిగా అన్నాడు.

'ఆ వ్యక్తి ఎవరో మనంకూడా తెలుసుకోవడం అవసరం. నువ్వతనిని అనుసరించు. అతనికి కనిపించకుండా అనుసరించి అతనెవరో తెలుసుకు రావాలి.'

నేపాళి సమాధానంగా తల ఊపి ఆ వ్యక్తి వెళ్ళినవైపు నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ వెళ్ళాడు.

మంత్రవాది వాళ్లు వెళ్ళినవైపు చూస్తూ కాసేపక్కడే నిలబడ్డాడు. వాళ్లు చూపుకందకుండా వెళ్ళిపోయింతర్వాత అక్కడినించి మళ్ళీ తలుపులదగ్గరికి వచ్చి లోపలి వాళ్లేం మాట్లాడుకుంటున్నదీ వినడానికి ప్రయత్నించనారంభించాడు. ఈసారి లోపలినించి సంభాషణలు బిగ్గరగానే వినపిస్తున్నాయి. వాటిని వింటూంటే మంత్రవాదికి నవ్వు రాసాగింది.

'ఎవరో వ్యక్తి కిజడిసి వెనక్కి వెళ్లిపోడానికి మనం పిరికి పందలం కాము. రండి. సారంగంగుండా వెళ్ళిపోదాం. మా సైనికులు మనకోసం ఎదురుచూస్తూ ఉండి ఉంటారు.' అన్నాడు మంత్రి జయసింహుడితో.

'ఆ వ్యక్తికి జడిసి సారంగ మార్గంలో వెళ్ళడానికి నేను వెనుకాడడం లేదు. కాని అతను చెప్పిన విషయాలు నిజమే నేమో అనిపిస్తోంది నాకు. అలే నిజమైతే మీకు సహాయం చెయ్యడం తెలివి తక్కువ పనే,' జయసింహుడన్నాడు.

'ఆ వ్యక్తి చెప్పినవన్నీ అబద్ధాలు. నామాట నమ్మండి.' అంది మహామాయ.

'నీ మాటలు నిజమని ఎలా నమ్మడం! నమ్మడానికి వీలుగా ఆధారాలు చూపించగలవా?' జయసింహుడడిగాడు.

తర్వాత కాసేపు ఎవరూ మాట్లాడలేదు. తిరిగి జయసింహుడన్నాడు.

'ఆ వ్యక్తి అన్నట్టు నరేంద్రమహారాజుగాని, ఆయనకు సంబంధించినవాళ్లుగాని నాకెలాంటి అపకారమూ చెయ్యలేదు. మీ మాటలు విని ఆయనకు ఎదురుతిరగడం మంచిది కాదనిపిస్తోంది నాకు కూడా.'

మంత్రి ఛీత్కారంగా అన్నాడు.

'నువ్వా పిరికిపంద వేనన్నమాట. నరేంద్రమహారాజు పేరు వినగానే భయపడిపోయావన్నమాట!'

'నేనుకాదు పిరికిపందని. నువ్వు. ఆ వ్యక్తి చెయ్యి పట్టుకోగానే చేతిలోని కత్తిని జారవిడిచావు.' పరిహాసంగా అన్నాడు జయసింహుడు.

వాళ్ల సంభాషణను ఆపుతూ మహామాయ మధ్యలో అంది.

'కాని నన్ను నమ్మించి నా దగ్గర ఎంతో ధనసహాయం పొంది చివరికిలా నన్ను మోసగించడం మంచిపనా?'

'నీలాంటి మోసగాళ్లను ఇలా మోసగించాల్సిందే. ఒకవేళ నువ్వు నిజంగా మహారాణివనుకుంటే స్వార్థంకోసం భర్తను ఖైదులో పెట్టడంకంటే పెద్ద మోసమేముంది!' జయసింహుడన్నాడు.

ఈసారి మహామాయ కోపంగా అంది.

'ఇవన్నీ తెలిసిఉండే నువ్వు మాకు సాయం చెయ్యడానికంగీకరించావు. నా దగ్గరినించి అందుకు ప్రతిఫలంగా ముందుగానే ఎంతో ధనం పుచ్చుకున్నావు. ఇప్పుడు ఎవరో ఏదో అన్నారని పిరికి పందలా ప్రవర్తిస్తున్నావు.'

జయసింహుడు మరుక్షణంలో కత్తిదూసి సింహంలా గర్జించాడు.

'అవన్నీ అనవసరం. మీలాంటి నీచుల్ని తక్షణం కత్తికి బలిచేయడం మంచిది.'

తలుపుదగ్గర నిలబడి ఈ మాటలన్నీ వింటున్న మంత్రవాది సమయం మించిపోయిందనుకున్నాడు. వెంటనే గట్టిగా

చప్పట్లు కొట్టాడు. దగ్గర్లోనే సిద్ధంగా నిలబడి ఉన్న సైనికులు పరుగెత్తుకువచ్చి మంత్రవాది ఆజ్ఞ మీద తలుపులు తెరచుకుని లోపలికి ప్రవేశించారు.

మహామాయను, మంత్రిని బంధించమని తమ సైనికుల కాజ్ఞాపించాడు మంత్రవాది. అకస్మాత్తుగా మంత్రవాదిని, సైనికులను చూడగానే అక్కడున్న ముగ్గురూ నివ్వెరపోయారు.

మంత్రవాది జయసింహుడి నుద్దేశించి బిగ్గరగా అన్నాడు.

'కత్తిని ఒరలో వేసుకోండి. మీరు చేద్దామనుకున్న పనిని మా సైనికులు చేస్తారు. మీరు నాతోపాటు రండి.'

ఏం చెయ్యడానికీ తోచని పరిస్థితిలో ఉన్న మహామాయ, మంత్రి సైనికులకు ఎదురుతిరగలేకపోయారు. కేవలం సైనికులైతే వాళ్లు లెక్కపెట్టేవాళ్లు కాదు. కాని తాము ఎదురుతిరిగితే అటు మంత్రవాది, ఇటు జయసింహుడుకూడా తమ మీదకి కత్తి దుయ్యవచ్చు. ఇందరిని ఎదుర్కొనగల సమగ్రత తమ దగ్గర లేదు.

సైనికులు ఇద్దరినీ బంధించారు. మంత్రవాది ఆజ్ఞప్రకారం కోటవైపు వాళ్లను తీసుకు బయలుదేరారు. మంత్రవాది వాళ్ల వెనకే బయలుదేరాడు. జయసింహుడు కూడా అతనిననుసరించాడు. నిశ్శబ్దం అన్నివైపులా ఆవరించి ఉంది.

## 10

నర్మద తనగదిలో గాఢనిద్రలో మునిగి ఉంది. చింతలన్నీ తొలగిపోవడంతో కొంత విశ్రాంతిగా నిద్రపోగల అవకాశం ఆమెకు లభించింది. నిశ్చింతగా ఆమె నిద్రలో మునిగిపోయింది.

అకస్మాత్తుగా గదిలో ఏదో చప్పుడైంది. నర్మదకు నిద్రా భంగమైంది. ఏమిటో అని ఆమె కళ్ళు తెరచి చూసింది. గది తలుపులు మూసే ఉన్నాయి. చిన్న దీపం ఒకటి ఒకమూలగా వెలుగుతోంది. గదిలో ఎవరూ కనిపించలేదు.

ఆమె లేచి కూర్చుంది. చప్పుడు ఎటునించి వచ్చిందో ఆమెకు తెలియలేదు. ఆమె చూపు నేలమీదకి ప్రాలింది. కొద్దిదూరంలో ఎదురుగా నేలమీద ఒక కాగితం ఆమె కంట పడింది. లేచి ఆ కాగితాన్ని చేతిలోకి తీసుకుంది. దీపం దగ్గరికి వెళ్ళి ఆ కాగితం మడతవిప్పి చదవనారంభించింది.

నర్మదగారికి,

ఈ కాగితం వ్రాసిందెవరో మీకు తెలియాల్సిన అవసరం లేదు. అందు చేత క్రింద సంతకం చెయ్యలేదు. అయితే ఇతరుల మాటలమీద ఏమాత్రం నమ్మకముంచదలచుకున్నా ఈ విషయాలు నమ్మండి.

యమదూత నిరపరాధి అని నేననడం లేదు. కాని అతను మీరనుకున్నంత దుర్మార్గుడు కాడని మనవిచేస్తున్నాను. ఎవరో ఒక దుష్టుడు మిమల్ని నమ్మించి అతనిమీదికి అపరాధాన్నంతా తొయ్యాలని చూస్తున్నాడు.

ఇందుకు బుజువులు కావాలంటే రేపు యమదూతను, మీతో పాటు మీ తండ్రి వేషంలో ఉన్న వ్యక్తిని, ఒకచోట సమావేశ పరచండి. మంత్రవాది, రఘువీర్ మహారాజు తదితర ముఖ్య వ్యక్తులు కూడా అక్కడ ఉండేట్టు చూడండి. మీతో పాటు మీరు మీ సోదరినికూడా సమావేశంలో పాల్గొనేట్టు చెయ్యండి.

ఇదొక్కటే నేను కోరేది. నిజానిజాలు తెలుసుకోవాలంటే ఈ పని చెయ్యండి. ఇందుకు మీకు ఏమాత్రం అభ్యంతరం ఉండదనుకుంటాను.

ఒక అజ్ఞాతవ్యక్తి.

నర్మద ఆ కాగితాన్ని మడచి ఒక్క నిమిషం ఆలోచిస్తూ నిలబడింది. తర్వాత గది తలుపులు తెరచి బయటికి చూసింది. అన్నివైపులా నిశ్శబ్దంగా ఉంది. ఇంకా తెల్లవారడానికి చాలాసేపు పడుతుంది. అందరూ గాఢ నిద్రల్లో ఉండి ఉంటారు.

ఇప్పుడు ఎవరినీ నిద్రలోంచి లేపడం మంచిది కాదనుకుంది నర్మద. మళ్లీ తలుపులు మూసి వెనక్కి వెళ్లి మంచంమీద పడుకుంది.

కాని నిద్రపట్టేట్టు లేదు. రకరకాల ఆలోచనలు మనస్సులో మెదులుతున్నాయి. యమదూత తమపట్ల ఎంత అపచారం చేశాడో అన్నది తేలకుండా ఉంది. ఈ కాగితంలో విషయాలు నిజమై ఉంటే తమతోపాటు ఉంటున్న వ్యక్తి తమ తండ్రి అయి ఉండడు.

ఏది ఏమైనా కాగితంలో రాసి ఉన్న ప్రకారం రేపు ఒక సమావేశం జరపడమే మెరుగనుకుంది నర్మద. అలా చేసినందువల్ల తనకు కలిగే నష్టమేముంది?

నర్మదకు ఎంతకూ నిద్రపట్టలేదు. ఆలోచనలతోనే కాలం గడచిపోయింది. క్రమంగా తెల్లవారింది. అంతటా కోలాహలం వ్యాపించింది. వెలుగు అన్నిదిక్కులా ఆక్రమించింది. నర్మద మంత్రివాది కోసం వెంటనే కబురు పంపింది.

రాత్రి జరిగిన విశేషాలన్నీ మంత్రవాదినడిగి తెలుసుకుంది నర్మద. తాను పిలిపించిన కారణం తెలియచేసి చివరికి అంది.

'ఈ ఉత్తరంలో ఉన్న ప్రకారం ఒక సమావేశం ఏర్పాటు చేస్తే బాగుంటుందనుకుంటున్నాను. అందుకు మీరే మంటారు?'

మంత్రవాది జవాబిచ్చాడు.

'నేనూ అలాగే భావిస్తున్నాను. సమావేశం జరిపినంత మాత్రాన మనకేమీ నష్టం కలగదుగా. పైగా రాత్రి మేం చూసిన వ్యక్తి ఈ ఉత్తరం రాసి ఉంటాడని నాకు అనుమానంగా ఉంది. అతని మాటల్ని బట్టి అతను మన శ్రేయస్సు కోరేవాడే అనిపిస్తోంది. అందుచేత సమావేశం ఏర్పాటు చేద్దాం.'

'సరే. అందుకేర్పాట్లు చెయ్యండి. నేనూ మా అక్కతో సహా వస్తాను,' అంది నర్మద.

మంత్రవాది నర్మద గదిలోంచి తన పనిమీద వెళ్ళిపోయాడు.

ప్రధాన భవనంలోని హాలులో సమావేశం ఏర్పాటు చేయబడింది. రఘువీర్ మహారాజు, మంత్రవాది, నరసింగభూపతి, నర్మద, కళ్యాణి, కాళి అందులో పాల్గొన్నారు. నేపాళి, విక్రమ్ ఇంకా పనులు ముగించుకుని తిరిగి రాలేదు.

నర్మద అంది. 'యమదూతను రప్పించండి.'

మంత్రవాది సమాధానమిచ్చాడు. 'అతని కోసం భటుల్ని పంపాను. జయసింహుడినికూడా ఇక్కడికి రప్పిస్తే బాగుంటుందనుకుంటాను. ఈ విషయాలు తెలుసుకోవాలని అతనికీ కుతూహలంగా ఉంది.'

'అలాగే కానీండి,' -నర్మద అంది.

మంత్రవాది జయసింహుడిని తీసుకురావడానికి వెళ్ళాడు. వాళ్ళిద్దరూ తిరిగి వచ్చేసరికి యమదూతకూడా హాలులో దీనంగా నిలబడి ఉన్నాడు.

రఘువీర్ మహారాజు యమదూతవంక చూసి అన్నాడు.

'నువ్వు నిరపరాధివని నిరూపించుకోడానికి చెప్పదల్చుకున్న విషయాలు చెప్పు. చూపదల్చుకున్న ఆధారాలు చూపించు.'

యమదూత వంచుకుని ఉన్న తల పైకెత్తి అన్నాడు.

'నా మాటలు ఎవరూ నమ్మడంలేదు. నరసింగభూపతి వేషంలో ఉన్న వ్యక్తి మోసగాడని నేను చెప్పినా నా మీద మీకు నమ్మకం కలగడంలేదు.'

'కేవలం ఆ మాట చెప్పినందువల్ల ప్రయోజనమేమిటి? నువ్వు చాలా అపరాధాలు చేశావని ఆయన తన దగ్గర ఉన్న ఉత్తరాలద్వారా నిరూపిస్తున్నాడు. అలాగే నువ్వూ ఏవో ఆధారాలు చూపించి ఆ వ్యక్తి సరయినవాడు కాదని నిరూపించాలి,' అన్నాడు రఘువీర్ మహారాజు యమదూతతో.

కొంచెంసేపు ఆలోచించి యమదూత అన్నాడు.

'అందుకవకాశం ఇస్తే నేనూ ఆధారాలు సంపాదించగలను. అయితే కొద్దిరోజులు నన్ను స్వేచ్ఛగా వదలాలి.'

'స్వేచ్ఛగా వదలితే పారిపోయి దాక్కుందామని చూస్తున్నాడు. మోసగాళ్లను నమ్మడం మంచిదికాదు.' నరసింగ భూపతి అన్నాడు.

'ఎవరు మోసగాళ్లో కాసేపట్లో తెలుస్తుంది. యమదూతను వదలనక్కరలేదు. అతని తరఫున నేను ఆధారాలు సాక్ష్యాలు చూపెడతాను.'

అకస్మాత్తుగా వినిపించిన ఈ మాటలు అందరినీ ఆశ్చర్య చకితుల్ని చేశాయి. దృఢంగా ఉన్న ఒక వ్యక్తి గంభీరంగా అడుగులు వేసుకుంటూ వచ్చి హాలులో నిలబడ్డాడు. అందరి చూపులూ అతనిమీదకి మరలాయి. అందరిలోకీ యమదూత మిక్కుటంగా ఆశ్చర్యానందాల ననుభవించసాగాడు.

ఆ వ్యక్తి తన గంభీరమైన చూపుల్ని అందరిమీదా ఓసారి ప్రసరింపచేసి చిరునవ్వు నవ్వాడు. మరుక్షణంలో తన ఉడుపులలోంచి ఒక చిన్న పెట్టెను తీసి నేలమీద ఉంచాడు. అక్కడున్న వాళ్లందరి చూపులూ ఆ పెట్టెమీదకి తిరిగాయి.

దానిని చూసిన నరసింగభూపతి కంగారుగా లేచి నిలబడ్డాడు. ఆ వ్యక్తి ఓసారి గంభీరాట్టహాసం చేసి అన్నాడు.

'ఎక్కడికీ పారిపోలేవులే. అక్కడే కూర్చో. అందరినీ అన్ని విషయాలూ తెలుసుకోనీ.'

నరసింగభూపతి తిరిగి యథాస్థానంలో కూర్చున్నాడు. సమావేశ స్థలంలో కాసేపు నిశ్శబ్దం ఆవరించింది. ఎవరికీ ఏం మాట్లాడడానికీ తోచలేదు.

—:o:—

దృఢంగా ఉన్న ఆ వ్యక్తి ఎవరు? ఆ పెట్టెలో ఉన్న వస్తువులేమిటి? సమావేశం ఏవిధంగా ముగిసింది? తర్వాత ఏం జరిగింది? మొదలైన విషయాలు మహామాయ పదమూడవ పుస్తకం 'పరాభవం'లో చదవండి.

## ఏజెంట్లు గమనించాలి

మేం ఎన్ని సార్లు విజ్ఞప్తులు చేసినా ఏజెంట్లు డబ్బు పంపడం చాలా ఆలస్యం చేస్తున్నారు. అందుచేత మేం పుస్తకాలు సకాలంలో వెలువరించడానికి ఇబ్బంది కలుగుతోంది.

మహామాయ-13

# పరాభవం

ఫిబ్రవరి 28 న వెలువడుతుంది.

మార్చి 10, 20, 30 తారీఖులలో 14, 15, 16 భాగాలు వెలువరించడానికి ఏర్పాట్లు చేశాం. ఏజెంట్లు పై తారీఖుల లోగా డబ్బు పంపితే ఒక్క రోజు కూడా ఆలస్యం కాకుండా మేం పుస్తకాలు అందజేస్తాం.

పై తారీఖులలోగా డబ్బు పంపి ఏజెంట్లు పుస్తకాలు తెప్పించి ఇవ్వకపోతే పాఠకులు మాకు తిన్నగా డబ్బు పంపి పుస్తకాలు తెప్పించుకోవచ్చు. పుస్తకాలు తప్పక ప్రకటించిన తేదీలలో వెలువడతాయి.

విజ్ఞాన సాహితి
టి. నగర్ : : మద్రాసు-17

డిటెక్టివ్, మిస్టరీ కథలు—వినోద హాస్యకథలు—
సాంఘిక, ప్రేమ కథలతో; మహాభారతం సీరియల్ తో;
విచిత్ర విజ్ఞాన విషయాలతో, వినూత్న పద్ధతులలో
క్రౌన్ ఆక్టేవో సైజు 84 పేజీలతో
అందాలు చిందే త్రివర్ణ ముఖచిత్రంతో
లోపల చక్కని చిత్రాలతో
అత్యంతాకర్షణీయంగా, సర్వాంగసుందరంగా




తెలుగు డైజెస్ట్ మాసపత్రిక

ప్రఖ్యాతాంధ్ర రచయిత కనకమేడల సంపాదకత్వాన ఏప్రిల్ సంచిక ఉగాది ప్రారంభ సంచికగా మార్చి నాలుగవ వారంలోనే వెలువడుతుంది. వెల 0-6-0

ఏజెంట్ల నియమాలు మామూలే. 25 పర్సెంటు కమిషన్ పోను సొమ్ము ఆర్డరుతోపాటు విజ్ఞానసాహితి పేరనే మార్చి రెండవవారంలోగా పంపాలి. ఆపైన వచ్చే ఆర్డర్లకు కాపీల సప్లయ్ విషయంలో గ్యారంటీ ఇవ్వలేము.

విజ్ఞాన సాహితి
టి. నగర్ :: మద్రాసు-17

**DANDAYATRA** V-23 Re. 0-8-0

ఆంధ్రదేశంలో రికార్డు అద్వితీయంగా అమ్ముడు పోతున్న ఒకే ఒక డిటెక్టివ్ & మిస్టరీ సీరియల్

# మహామాయ – 12 దండయాత్ర

మహామాయ సీరియల్లో ఇది 12 వ పుస్తకం

★

కనకమేడల ముద్రిత గ్రంథాల్లో 32 వ రచన

★

విజ్ఞాన సాహితి ప్రచురణలలో 23 వ కానుక

★

ఈ పుస్తకంతో కనకమేడల రచనలు 1,40,000 ప్రతులు అమ్ముడయ్యాయి

★

ఇందులో కేవలం మహామాయ సీరియల్లోని పుస్తకాలు మాత్రం 75,000 ప్రతులు అమ్ముడయ్యాయి

మీరూ కనకమేడల రచనలు చదివి ఆనందించండి. ముఖ్యంగా ఓసారి మహామాయ పుస్తకాలు చదవండి.

**A VIGNANA SAHITI Publication in Telugu**